ప్రజాశక్తి

బుధవారం 18 జనవరి 2023 8 పేజీలు

ప్రకాశం బాపట్ల







మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

దేవుడి దయ ఉంటే..
175 స్థానాలూ గెలుస్తాం..

రాష్ట్ర మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్

ప్రజాశక్తి-త్రిపురాంతకం

దేవుని దయ, ప్రజల దీవెనలు ఉంటే వచ్చే ఎన్నికల్లో తప్పకుండా 175కు 175 స్థానాలు గెలుస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ధీమా వ్యక్తం చేశారు. మంగళవారం త్రిపురాంతకంలో జరిగిన కన్వీనర్లు, వాలంటీర్లు, పార్టీ నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ కన్వీనర్లు, వాలంటీర్లు పార్టీని సమన్వయంతో నడిపించాలన్నారు. ప్రతి కుటుంబానికీ ప్రభుత్వంతో పాటు పార్టీ కూడా అండగా ఉంటుందన్నారు. సమన్వయంతో పని చేస్తూ ప్రతి ఇంటికి వెళ్లి అర్హులకు సంక్షేమ పథకాలు అందజేస్తూ, అదే సమయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన లేఖను కూడా అందజేయాలని అన్నారు. 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న చంద్రబాబుతో రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదన్నారు. ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ పరిస్థితి ఆగమ్య గోచరంగా తయారైందన్నారు. వాలంటరీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని అన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు ప్రజలను మోసపూరిత మాటలతో మభ్యపెట్టే ప్రయత్నం చేస్తూ ఉంటారని అన్నారు. నియోజకవర్గంలో కన్వీనర్లు, వాలంటీర్లు, సమన్వయంతో పని చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులకు అందించాలని తెలిపారు. సమావేశంలో ఏఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, జడ్పీటిసి మాకం జాన్‌పాల్, సర్పంచ్ పొన్నా వెంకటలక్ష్మి, వైసిపి మండల కన్వీనర్ పోలిరెడ్డి పాల్గొన్నారు.

నిర్వాసితుల పట్ల నిర్దయ

- ప్యాకేజీల్లో పేర్లు గల్లంతుపై ఆందోళన
- సమాధానం చెప్పే నాథుడే లేక అయోమయం
- 'వెలిగొండ' నిర్వాసితుల కోసం సిపిఎం మరో ఉద్యమం



సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుకు సమస్యలు వివరిస్తున్న నిర్వాసితులు (ఫైల్)

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

- 'సర్వే చేసినప్పుడు లిస్టులో మా పేరు ఉంది. మళ్లీ లిస్టు తెచ్చారు. ఇప్పుడు మా పేరు లేదయ్యా..' అంటూ వెలిగొండ ముంపు గ్రామమైన గొట్టిపడియ గ్రామంలో ఇటీవల పలువురు నిర్వాసితులు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఎదుట వాపోయారు.

- 'అధికారులకు లక్ష రూపాయలు ఇస్తే జాబితాల్లో చేర్చుతామంటున్నారయ్యా..' అంటూ సుంకేశుల గ్రామంలోని నిర్వాసితులు బహిరంగంగానే వాపోయారు. నాయకులు ఏం చేస్తున్నారో కూడా చెప్పడం లేదని, మమ్మల్ని మాట్లాడకుండా చేస్తున్నారని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వెలిగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాలు 12 ఉన్నాయి. ఇప్పటికీ అక్కడే ఉన్నారు. మరో ఐదారు నెలల్లో అక్కడ నుంచి ఖాళీచేస్తే తప్ప సెప్టెంబరులో ప్రాజెక్టును ప్రారంభించడానికి వీల్లేదు. అయితే సర్వం కోల్పోయి భూములతో పాటు ఇళ్లూవాకిళ్లూ కోల్పోయి కట్టుబట్టలతో ఊళ్లు వదిలివస్తోన్న నిర్వాసితుల పట్ల ప్రభుత్వం నిర్దయగానే వ్యవహరిస్తోంది. వారి త్యాగాలను పట్టించుకునే పరిస్థితి కనిపించడం లేదు. వెలుగొండ ప్రాజెక్టు వస్తే పశ్చిమప్రాంతం సస్యశ్యామలం అవుతుందని చెబితే 12 గ్రామాల ముంపువాసులు ఆనందంగానే తమ భూములను ఇచ్చేశారు. ఆనాడు ఎకరం లక్ష రూపాయలకే ప్రభుత్వానికి అప్పగించారు. ఈ రోజు ఆ భూముల ధరలు ఎకరం రూ.15 లక్షలకు పైగానే ధర ఉంది. అయినా దాన్ని పట్టించుకోవడం లేదు. ఇప్పుడు ఇచ్చే ప్యాకేజీలు సరిగ్గా ఇవ్వాలని కోరుతున్నారు. అర్హులందరికీ ఇవ్వాలని వేడుకుంటున్నారు.

నిర్వాసితుల జాబితాల తయారీలో ఇప్పటికీ గందరగోళం కొనసాగుతోంది. 2019లో ఖరారు చేసిన తుదిజాబితాలోని పేర్లు కూడా తాజాగా విడుదల చేసిన జాబితాల్లో రాలేదు. కారణం స్థానికంగా నివాసం లేరని, ఆధార్‌కార్డులు, రేషన్‌కార్డులు, జనన సర్టిఫికెట్లు, అడ్రస్ ప్రూపులు సరిగా లేవనే కారణాలతో సుమారు 2500 మందికిపైగా పేర్లను పక్కన బెట్టేశారు. అధికారులు చేస్తున్న ఈ తప్పిదాలను అక్కడ పాలకపక్ష నేతలు కూడా పట్టించుకోవడం లేదు. పేర్లు చేర్చాలంటే లక్ష రూపాయలు లంచం ఇస్తేనే చేర్చుతామని చెబుతున్నారని నిర్వాసితులు వాపోతున్నారు. కొందరు పాలకపక్ష నేతలు, అధికారులు కలిసి నిర్వాసితుల పొట్టగొడుతున్నారు. అన్ని అర్హతలున్నా వారిని తీసేశారు. అధికారులకు ఒక్కొక్కరు పదుల సంఖ్యలో అర్జీలు ఇచ్చారు. కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. ఆర్డీవో ఆఫీసుల వద్దకు వెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. అప్పట్లోనూ ఆర్డీవో ఆఫీసు వద్ద వంటావార్పు పెట్టి ఆందోళన చేసినందునే ప్యాకేజీ రూ.12.50 లక్షలు నిర్ణయించారు. దీన్ని కూడా అర్హులందరికీ ఇచ్చే దగ్గరకు వచ్చేసరికి కోతలు పెడుతున్నారు. ఏదో ఒక కారణంతో లబ్ధిదారుల సంఖ్యను తగ్గిస్తున్నారు. ఇదేదో ప్రభుత్వం ఇచ్చే సంక్షేమ పథకాలకు ఎంపిక చేసినట్లుందే తప్ప నిర్వాసితులనే ఆలోచన లేదు. అక్కడ ప్రతి ఒక్కరికీ ఇవ్వాల్సి ఉంది. ఊరు వదిలి వచ్చే ప్రతిప్రాణికీ పునరావాసం కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

ఊరికి 100 నుంచీ 150 మంది యువకులు ఇప్పుడు మేజర్లు అయ్యారు. వీరికి ప్యాకేజీ ఇవ్వాలి. అయితే వారి నుంచి అర్జీలు తీసుకుంటున్నారు. పుట్టిన తేదీ సర్టిఫికెట్లు ఇవ్వాలని కోరుతున్నారు. పదో తరగతి సర్టిఫికెట్ కావాలంటున్నారు. చదువుకోని వారికి ఎలా వస్తాయనేదీ చూడటం లేదు. అందరికీ ఇదే షరతు పెట్టారు. దీని వల్ల చదువు లేని వారిని పక్కన పెడుతున్నారు. ఏదో ఒక అధికారిని పట్టుకొని జనన సర్టిఫికెట్ తెచ్చుకుంటే ఇది కరెక్టు కాదని చెబుతున్నారని నిర్వాసితులు చెబుతున్నారు. కరెక్టు కాదని చెప్పడానికి అధికారుల వద్ద ఏమైనా ఆధారాలు ఉన్నాయా? లేదా? అంటే ఏమీలేవు. స్థానికంగా ఉండే అధికారులో లేక డాక్టర్లు గానీ వీటిని ఇచ్చే వీలుంటుంది. ఏదేమైనా దిగువస్థాయి అధికారులు ఇచ్చే సమాచారం ▶ 2లో

వ్యవసాయం భారమై..
'సంక్రాంతి'కి దూరమై..

- నాలుగేళ్లుగా రైతులకు నష్టాలు..
- ఏడాదికేడాదికీ పెరుగుతున్న అప్పులు
- అన్నదాతల్లో నైరాశ్యం
- సంక్రాంతి సంబరాలను బహిష్కరించిన చందలూరు ప్రజలు

ప్రజాశక్తి-పంగులూరు

సంక్రాంతి పండుగ అనగానే 15 రోజుల ముందు నుంచే ఒకప్పుడు ఆ గ్రామంలోనూ వాతావరణం కనిపించేది. కొత్త అల్లుళ్లు అత్తవారింటికి రావడం, బంధు, మిత్రులు రావడం, ఇళ్లల్లో రకరకాల పిండి వంటలు తయారు చేయడంలో మహిళలు నిమగ్నమవటం, తొమ్మిది రోజుల పాటు అనేక కళలకు సంబంధించి రోజు ఒక కార్యక్రమం నిర్వహించడం.. గతంలో ఆ ఊరి ప్రత్యేకత.. కానీ నేడు ఆ పరిస్థితి కనపడలేదు. ప్రస్తుతం ఆ గ్రామంలో సంక్రాంతి ఊసే లేదు. సంబరాలు లేవు, ఆటపాటలు లేవు, కళారూపాలు లేవు, అసలు పండగ వాతావరణమే కనిపించలేదు. గ్రామం మొత్తం సంక్రాంతి పండుగను బహిష్కరించిన పరిస్థితి. అదే.. పంగులూరు మండలంలోని చందలూరు గ్రామం.



బోసిపోయిన చందలూరులోని కళానిలయం

చందలూరు గ్రామంలో జనాభా సుమారు 4 వేల వరకు ఉంటుంది. ఈ గ్రామానికి 3,500 ఎకరాల భూమి ఉంది. మొత్తం నల్లరేగడి భూమి. పూర్తిగా వర్షాధారమైన ఆధారపడే ఈ భూమిలో, వాణిజ్య పంటలైన మిర్చి, శనగ, మినుము, పత్తి వంటి పంటలు ఇక్కడ సాగు చేస్తారు. ఇక్కడ ప్రతి కుటుంబం వ్యవసాయం మీద ఆధారపడి బతుకుతుంటారు. మండలంలోని వ్యవసాయ పంటలు సాగులో ఒకప్పుడు ఈ గ్రామం అగ్రగామిగా నిలిచింది. ఇక్కడ తెలుగువారికి ప్రీతిపాత్రమైన సంక్రాంతి పండుగను ఘనంగా నిర్వహించేవారు. సంక్రాంతికి ముందు తొమ్మిది రోజుల పాటు రోజుకు ఒక కార్యక్రమాన్ని గ్రామస్తులు నిర్వహించేవారు. బుర్రకథ, హరికథ, చెక్కభజన, కోలాటం, నాటికలు మొదలైన వాటిని ప్రతిరోజూ నిర్వహించడంతో.. గ్రామస్తులంతా ఐక్యంగా ఈ కార్యక్రమానికి హాజరై సంబరాల్లో పాల్గొనేవారు. గ్రామంలోని పెంట్యాల గోవిందయ్య కళా నిలయం దగ్గర భోగి పండుగ, సంక్రాంతి పండుగ, కనుమ... ఈ మూడు రోజులు అనేక కార్యక్రమాలు ఆహ్లాదభరితంగా జరుపుకునేవారు. ఉట్టి పగలగొట్టడం, ముగ్గుల పోటీలు, సైకిలు, డాక్టర్ స్లో పోటీలు, చిన్నపిల్లలు చేత సాంస్కృతిక కార్యక్రమాలు జరిగేవి. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి మహాలక్ష్మమ్మ అమ్మవారి కొలుపులు, తొమ్మిది రోజులు సేవా ప్రభల ఊరేగింపు, నాటకాలు, భజన కార్యక్రమాలు జరిగేవి. గ్రామ ప్రజలంతా పండుగలో పాలుపంచుకునేవాళ్లు. అలాంటిది ప్రస్తుతం ఆ గ్రామంలో సంక్రాంతి సంబరాలు లేవు. ఆటపాటలు లేవు. ప్రజల్లో ఉత్సాహం లేదు. నాలుగేళ్లుగా వర్షాలు లేక ఒకసారి, అధిక వర్షాలు కురిసి ఒకసారి, మిర్చికి తామర పురుగు సోకి ఒకసారి, బొబ్బర వల్ల ఒకసారి, ఇలా ప్రతిఏటా మిర్చి సాగు చేసిన రైతులు నష్టపోతూ వచ్చారు. శనగలకు సరైన ధరలు లేక కోల్డ్‌స్టోరేజీల్లో మగ్గుతున్నాయి. పంట నష్టపరిహారాలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఆ ఊసే ఎత్తలేదు. ప్రభుత్వ సహకారం లేక, పంటల సక్రమంగా పండక.. అప్పులు రోజురోజుకూ పెరిగిపోతూ రైతాంగంలో నైరాశ్యం కనిపిస్తోంది. ఏడాదికేడాదికీ ▶ 2లో

ఉప్పు రైతులను ఆదుకోవాలి : సిపిఎం

ప్రజాశక్తి-కొత్తపట్నం

ఉప్పురైతులను ఆదుకోవాలని సిపిఎం మండల కార్యదర్శి ఎస్.స్వామిరెడ్డి కోరారు. సిపిఎం మండల కమిటీ సమావేశం స్థానిక కార్యాలయంలో జి. శివరావు అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి రెడ్డి మాట్లాడుతూ ఒంగోలు- కొత్తపట్నం రహదారిలో బకింగ్‌హాం కెనాల్‌పై నిర్మిస్తున్న బ్రిడ్జికి అనుసంధానంగా సర్వీసు రోడ్డు ఏర్పాటు చేసి ఉప్పు రైతులను ఆదుకోవాలన్నారు. నిత్యం ఉప్పు రవాణా చేస్తున్న రైతులు సర్వీసు రోడ్డులేక అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి సర్వీసు రోడ్డును ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పి.శ్రీను, టి. రమణయ్య భాగ్యలక్ష్మి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సిపిఎం మండల కార్యదర్శి స్వామి రెడ్డి

టాయిలెట్ క్లీనర్స్ పంపిణీ

హనుమంతునిపాడు : గ్రామ సచివాలయాలకు మంజూరైన హైప్రెజర్ టాయిలెట్ క్లీనర్స్, ఇన్సులేటర్లు మాజీ ఎంపిపి గాయం బలరామిరెడ్డి మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, సుపరిపాలన అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అడుగులు వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి భవనం కష్ణారెడ్డి, ఎంపిటిసి ఉడుముల సుబ్బారెడ్డి, సూరిశెట్టి నారాయణస్వామి. బిసి సెల్ అధ్యక్షుడు మద్ధి తిరపతయ్య పాల్గొన్నారు.

నిర్వాసితుల పట్ల నిర్దయ

(మొదటిపేజీ తరువాయి)

ఆధారంగానే సర్టిఫికెట్లు ఇస్తారు. వీటిని ప్రాజెక్టు అధికారులు తిరస్కరిస్తున్నారని నిర్వాసితులు చెబుతున్నారు.

2019లో ఖరారు చేసిన జాబితా ప్రకారం 7236 మంది నిర్వాసితులున్నారు. వీరందరికీ ప్యాకేజీలు ఇవ్వాలి. అయితే తాజాగా ప్రకటించిన జాబితాల్లో మొత్తం 4600 మంది ఉన్నట్లు చెబుతున్నారు. మిగతా వారికి రకరకాల కారణాలు చెప్పి పక్కనపెట్టేశారు. తమకు ప్యాకేజీ వస్తుందా? లేదా? అనే ఆందోళన నిర్వాసితుల్లో పెరిగింది. ఇక్కడ నుంచి బయటకు వెళితే ఆ డబ్బు తప్ప ఏమీ లేదంటున్నారు. వాస్తవం కూడా.. అయితే ఇల్లు కట్టుకోవడానికి సరిపోతాయే తప్ప పునరావాసం కోసం ఈ ప్యాకేజీలు చాలవు. మరో చోట ఇప్పుడు భూమి కొనుగోలుకు కూడా డబ్బులు లేవు. ఆనాడు సేకరించిన భూమికి మరో చోట ప్రత్యామ్నాయంగా భూమి ఇస్తే రైతులకు పునరావాసం ఏర్పడేది. ఈ ప్రక్రియ జరగలేదు. పాలకపక్ష నేతలకు కూడా పట్టడం లేదు. నిర్వాసితులందరికీ ప్యాకేజీలు ఇప్పించే బాధ్యత తీసుకోవడం లేదు. అధికారులకు సరైన గైడెన్సు కూడా ఇచ్చే పరిస్థితి లేదు. ప్రధానంగా పశ్చిమప్రాంతంలో ఉన్న మంత్రి ఆదిమూలపు సురేష్‌తో పాటు ఎమ్మెల్యేలకు ముంపువాసుల కష్టాలు పట్టడం లేదు. గ్రామాల్లో దిగాలుగా ఉన్న వారి పట్ల ఉదార స్వభావంతో వ్యవహరించడం లేదు. అన్నీ త్యాగం చేసిన రైతులు అధికారుల చుట్టూ, నేతల ఇళ్ల చుట్టూ తిరగడం అంటే ఎంత దౌర్భాగ్యమో చూడాలి. తొలి నుంచి నిర్వాసితుల కోసం ఆందోళనలు కొనసాగిస్తున్న సిపిఎం ఇప్పుడు ప్యాకేజీలు సక్రమంగా అందేలా చేసేందుకు మరో ఉద్యమానికి శ్రీకారం చుడుతోంది. అందుకే ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, జిల్లా నేతలు ముంపు గ్రామాల్లో పర్యటించి వాస్తవాలు తెలుసుకున్నారు. నిర్వాసితుల కోసం మరో ఉద్యమానికి సన్నాహాలు చేస్తున్నారు.

వ్యవసాయం భారమై.. 'సంక్రాంతి'కి దూరమై..

(మొదటిపేజీ తరువాయి)

అప్పులు పెరిగిపోతున్నాయి. కనీసం పెట్టుబడులు కూడా రాక ప్రతి కుటుంబం ఇబ్బందులు పడుతోంది. ఈ పరిస్థితుల్లో సంక్రాంతి పండుగ జరుపుకోవాలనే ఆసక్తి కూడా గ్రామ ప్రజల్లో సన్నగిల్లిపోయింది. ఈ ఏడాది సంక్రాంతి పండుగ వాతావరణం గ్రామంలో కనిపించలేదు. సంక్రాంతి సంబరాలు జరిగే పెంట్యాల గోవిందయ్య కళానిలయం బోసిపోయింది. గ్రామంలో ఎక్కడా సంక్రాంతి సంబరాలు జరగలేదు. ప్రభుత్వం ఇప్పటికైనా వర్షాధారం, నీటిపారుదల అనే నిబంధనలను పక్కనపెట్టి, వ్యవసాయంలో నష్టపోయిన మిర్చి రైతులందరికీ నష్టపరిహారం అందించాలని, కోల్డ్ స్టోరేజీల్లో మగ్గుతున్న రైతుల సరుకును కొనుగోలు చేయించాలని, అప్పుడే రైతుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడి పండుగలను సంతోషకరంగా, ఆనందదాయకంగా జరుపుకుంటారని పలువురు రైతులు చెబుతున్నారు.

రహదారిపైకి చుక్కల దుప్పి ..



రహదారిపైకి వచ్చిన చుక్కుల దుప్పి

ఎక్కడ నుంచి వచ్చిందో ఏమో ఓ చుక్కల దుప్పి మండల పరిధిలోని వెంకట్రాజు పాలెం వద్ద జాతీయ రహదారిమ పైకి వచ్చింది. రహదారిపై వచ్చే పోయే వాహనాలను చూసి బెదిరిపోయింది. పొలాల్లోకి వెళ్లేందుకు ప్రయత్నించి ఫెన్సింగ్‌లో ఇరుక్కుపోయింది. అదే సమయంలో అటువైపుగా వెళ్తున్న కానిస్టేబుల్ సురేష్ దుప్పి చూసి అటవీ శాఖ అధికారులు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని దుప్పిని కాపాడి అటవీ ప్రాంతంలో వదిలిపెట్టేందుకు తీసుకెళ్లారు. **ప్రజాశక్తి-మద్దిపాడు**

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత

ప్రజాశక్తి-పొదిలి

పొదిలి పట్టణంలోని చిన్న బస్టాండ్ సెంటర్ మురుగునీటి కాలువలను ఆక్రమించి ఏర్పాటు చేసిన దుకాణాలను నగర పంచాయతీ అధికారులు మంగళ వారం తొలగిం చేందుకు ప్రయత్నించారు. అయితే ఆక్రమణల తొలగింపును వ్యాపారులు అడ్డుకున్నారు. దీంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది. డ్రైనేజీ సక్రమంగా లేకపోవడంతో మురుగునీటి పారుదల లేక పడుతున్న అవస్థల గురించి పలువురు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన అధికారులు మురుగునీరు పారేందుకు అడ్డుగా ఆక్రమణలను తొలగించేందుకు జెసిబితో వచ్చారు. దీంతో వ్యాపారులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో అధికారులు పోలీసులకు సహాయం కోరారు. ప్రజల సౌకర్యార్థం మురుగునీరు పారేందుకు చర్యలు తీసుకుంటున్న అధికారులను అడ్డుకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని పోలీసులు హెచ్చరించారు. నగర పంచాయతీ, పోలీసు అధికారుల హెచ్చరికలతో వ్యాపారులు అడ్డుతొలిగారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ డానియల్ జోసఫ్, నగర పంచాయతీ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



దుకాణదారులతో మాట్లాడుతున్న పోలీసులు



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నారపు శెట్టి పాపారావు

ఎన్‌టిఆర్ వర్థంతిని జయప్రదం చేయాలి

మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు

ప్రజాశక్తి-దర్శి

టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు, దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 27వ వర్ధంతి సభను జయప్రదం చేయాలని దర్శి మాజీ ఎమ్మెల్యే, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నారపశెట్టి పాపారావు తెలిపారు. ఎన్‌టిఆర్ వర్ధంతి కార్యక్రమ నిర్వాహణపై టిడిపి నాయకులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పాపారావు మాట్లాడుతూ ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా స్థానిక పిజిఎన్ కాంప్లెక్ కళ్యాణ మండపంలో అన్నదానం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఐదు మండలాల టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ నారపశెట్టి పిచ్చయ్య, టిడిపి మండల అధ్యక్షుడు చిట్టె వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షుడు యాదగిరి వాసు, నాయకులు సంగా తిరుపతిరావు, స్టీవెన్, రామయ్య, కొండలు పాల్గొన్నారు.

చోరీ కేసులో ఇద్దరు మైనర్లు అరెస్ట్

రూ.లక్ష విలువైన కంప్యూటర్లు, ప్రింటర్ స్వాధీనం

ప్రజాశక్తి-చీరాల

చీరాల మున్సిపల్ పరిధిలోని రాంనగర్‌లో ఉన్న సచివాలయంలో ఇటీవల చోరీకి పాల్పడి కంప్యూటర్లు, ప్రింటర్, అపహరించిన సంఘటన పాఠకులకు తెలిసిందే. అయితే ఆ కేసులో నిందితులను మంగళవారం రెండో పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయంపై స్థానిక రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌లో సీఐ సోమశేఖర్ విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మాట్లాడారు. ఈనెల ఏడో తారీఖున రాంనగర్‌లోని సచివాలయంలో దుండగులు చొరబడి అందులోని కంప్యూటర్లు, ప్రింటర్, ఇతర వస్తువులను అపహరించారని వార్డు అడ్మిన్ సెక్రటరీ ఎస్ఎస్ఎన్ భవాని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారని అన్నారు. ఈ మేరకు ఎస్పీ ఆదేశాల మేరకు డిఎస్పి శ్రీకాంత్ పర్యవేక్షణలో ఎస్ఐలు నాగరాజు, సురేష్‌లు కేసు నమోదు చేసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కేసును దర్యాప్తు కొనసాగించారన్నారు. ఈ నేపథ్యంలో అందిన సమాచారం మేరకు రామ్ నగర్ ఆర్టీసీ డిపో గ్యారేజీ ఎదురుగా వెళ్లేసరికి ఈపురుపాలెం వైపునకు అనుమానాస్పదంగా తిరుగుతున్న ఇద్దరు బాలురని గుర్తించి అదుపులోకి తీసుకున్నామన్నారు. అయితే తమ విచారణలో బాలురు ఇద్దరూ ఈపురిపాలెం ఇందిరా నగర్ గ్రామానికి చెందిన వారిగా గుర్తించామని వారిని తమ సిబ్బంది విచారించగా సచివాలయంలో చోరీకి పాల్పడింది తామేనని నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. వారి వద్ద నుంచి సుమారు లక్ష రూపాయలు విలువగల రెండు కంప్యూటర్లు, 1 ప్రింటర్, 1 సిపియు, 1 లామినేటర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. అయితే మరియమ్మపేటలోని ఓ ఇంటిలో తాళాలు పగలగొట్టి రూ.5 వేల నగదు అపహరించిన కేసు కూడా గతంలో వారిపై ఉన్నట్లు గుర్తించామన్నారు. ఈ కేసులో తక్షణమే స్పందించి కొన్ని రోజుల వ్యవధిలోనే కేసును ఛేదించిన చీరాల రెండో పట్టణ సిఐ జి సోమశేఖర్, వారి ఎస్ఐలు నాగరాజు, సురేష్‌లను, మరియు వారి సిబ్బంది బాజిత్, శివప్రసాద్, అహ్మద్‌బాషా, సుబ్బారావులను బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.



వివరాలు వెల్లడిస్తున్న సిఐ సోమశేఖర్


వివరాలు వెల్లడిస్తున్న బాపట్ల డిఎస్పీ శ్రీనివాసరావు

అత్యాచారం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-పర్చూరు: పర్చూరు ఇందిరాకాలనీలో ఇటీవల మానసిక వికలాంగురాలిపై జరిగిన అత్యాచారం కేసులో నిందితుడిని మార్టూరు సిఐ ఎస్‌కెటి ఫిరోజ్ మంగళవారం అరెస్టు చేశారు. ఈ మేరకు పర్చూరు పోలీస్ స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశానికి బాపట్ల డిఎస్పీ శ్రీనివాసరావు హాజరై వివరాలు వెల్లడించారు. మానసిక వికలాంగురాలిపై ఇందిరా కాలనీకి చెందిన మిండాల సుబ్రహ్మణ్యం అత్యాచారం చేయటంపై వచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి సుబ్రహ్మణ్యంను అదుపులోకి తీసుకొని ఫోక్సో చట్టంపై కూడా కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. సమావేశంలో ఎస్ఐ జివి చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తకాలువలో వృద్ధుడి మృతదేహం

ప్రజాశక్తి-వేటపాలెం: మండల పరిధిలోని రామన్నపేట కొత్తకాలువ బ్రిడ్జి సమీపంలో మంగళవారం వృద్ధుని మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. మృతదేహం కాలువలోని గుర్రపుడెక్కలో ఇరుక్కుపోయి ఉంది. సమాచారం అందుకొన్న ఎస్ఐ జి సురేష్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని స్థానికుల ద్వారా వివరాలు రాబట్టారు. మృతుడు రావూరిపేటకు చెందిన గుత్తి వెంకట సుబ్బారావు(85)గా గుర్తించామని తెలిపారు. నాలుగు రోజుల నుంచి కుటుంబ సభ్యులు అతడి కోసం గాలిస్తున్నట్లు తెలిసింది. పంచనామా నిర్వహించి మృతదేహాన్ని చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టనున్నట్లు ఎస్ఐ సురేష్ విలేకర్లకు తెలిపారు.

మృతదేహం గుర్తింపు

ప్రజాశక్తి-దర్శి: సోమవారం గుర్తు తెలియని శవం సాగరు కాలువలో కొట్టుకొని రాగా మంగళవారం ఆ శవాన్ని గుర్తించినట్లు స్థానిక ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. జిల్లాలోని యర్రగొండపాలెం మండలం అమాని గుడిపాడుకు చెందిన జాగర్లమూడి గాలయ్య(61)గా గుర్తించినట్లు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. జనవరి 1న మతిస్థిమితం లేనందున ఇంట్లో నుంచి వెళ్లిపోయాడని, కనిపించలేదని, ఆ శవం గాలెయ్యదేనని కుమారుడు, కుటుంబ సభ్యులు గుర్తించారని ఆయన తెలిపారు. మృతునికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

జూదరులకు జైలుశిక్ష

ప్రజాశక్తి-యర్రగొండపాలెం: మండలంలోని కొలుకుల పంచాయతీ పరిధిలోని చెన్నరాయునిపల్లి గ్రామ శివారులో సంక్రాంతి రోజున కోడిపందాలు ఆడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి మూడు కోళ్లను, రూ.13,720 నగదును సీజ్ చేసి వారిపై ఏపీ గేమింగ్ యాక్ట్ కింద కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. కాగా వారిని మంగళవారం మార్కాపురం కోర్టుకు హాజరు పరచగా ఒక్కొక్కరికి ఐదు రోజులు పాటు జైలు శిక్షతో పాటు రూ.50 జరిమానా విధించినట్లు ఎస్ఐ గంటా కోటయ్య తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినట్లైతే అట్టి సమాచారాన్ని డయల్ 100కు గాని, యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌లో గాని సమాచారం అందించాలని కోరారు.

చేపల చెరువుకు బహిరంగ వేలం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్: బాపట్ల మండలం చుండూరుపల్లి గ్రామంలోని చేపల చెరువు లీజుకు వేలం పాట జరిగింది. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ సర్పంచ్ గోరిజవోలు వంశీకృష్ణ కార్యదర్శి స్టాలిన్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. 9 నెలల కాలానికి చేపలు పెంచి పట్టుకునేలా జరిగిన వేలంలో సర్కారు వారి పాట 90 వేలుగా ఉండగా, 91 వేలకు ఎం అనిల్ హెచ్చు పాట పాడుకున్నారు. ఈ వేలంలో గిరిజవోలు రామారావు, ఎం తిరుపతయ్య, మెరుగుమోలు సోమయ్య, వలి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ వంశీకృష్ణ మాట్లాడుతూ చెరువు పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉండేలా చూడాలని సూచించారు.

వెంకటసుబ్బయ్యపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని మాచవరం గ్రామంలో మానసిక యువతిపై అసభ్యకరంగా ప్రవర్తించిన పీకా వెంకటసుబ్బయ్యపై చర్యలు తీసుకోవాలని నవ్యాంధ్ర వికలాంగుల సేవా సమితి జిల్లా అధ్యక్షులు షేక్ కాలేషా డిమాండ్ చేశారు. వివరాల మేరకు మండలంలోని మాచవరం గ్రామానికి చెందిన పీకా సురేంద్రబాబు కూలి పనులు చేసుకొని జీవిస్తుంటారు. ఆయనకు ముగ్గురు సంతానం. ఇద్దరు అమ్మాయిలు ఒక అబ్బాయి. వారిలో రెండో కుమార్తె మానసిక వికలాంగురాలు. ఈ నేపథ్యంలో అదేగ్రామానికి చెందిన పీకా వెంకటసుబ్బయ్య ఈ నెల 14వ తేదీన గ్రామంలో కాంతారావు పెద్దకర్మ సందర్భంగా సాయంత్రం కూడా కార్యక్రమం ఉన్నందున ఇంటింటికీ తిరిగి భోజనాలు చెప్పే క్రమంలో పీకా సురేంద్రబాబు వాళ్లకు కూడా చెప్పి వెళ్లాడు. ఈ నేపథ్యంలో మానసిక వికలాంగురాలు తల్లి సాయంత్రం ఆరుగంటల సమయంలో చిల్లర సరుకులకు అంగడికి వెళ్ళింది. అది గమనించిన వెంకటసుబ్బయ్య సురేంద్ర ఇంటిలోకి వెళ్లి తలుపులు వేసి మానసిక వికలాంగురాలిపై అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆ సమయంలో అంగడి నుంచి వచ్చిన ఆమె తల్లి తలుపుతట్టగా గడియ పెట్టిఉంది. అనుమానంవచ్చి కిటికిలోగుండా చూడగా లోపల వెంకటసుబ్బయ్య మానసిక వికలాంగురాలైన తమకుమార్తెపై అసభ్యకరంగా ప్రవర్తిస్తుండగా గమనించి పెద్దగా కేకలు వేయడంతో వెంకటసుబ్బయ్య వేగంగా తలుపులు తీసి పారిపోయాడు. జరిగిన సంఘటను పొలం నుంచి వచ్చిన మానసిక వికలాంగురాలి తండ్రి సురేంద్రబాబు వాళ్ళ సోదరుడికి ఆమెతల్లి తెలిపింది. దాంతో వాళ్ళు పోలీస్ స్టేషనులో ఫిర్యాదు చేశారు. దాంతో పోలీసులు నామ మాత్రంగా కేసు నమోదు చేశారు తప్ప నేటికీ ముద్దాయిని పిలిచి విచారించి తగిన చర్యలు తీసుకోలేదని అన్నారు. గతంలో కూడా గ్రామంలో కొంతమంది మహిళలపట్ల వెంకటసుబ్బయ్య అసభ్యకరంగా ప్రవర్తించారని గ్రామస్తులు తెలిపారు. ముద్దాయిపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిచో నవ్యాంధ్ర వికలాంగుల సేవాసమితి ఆధ్వర్యంలో సురేంద్ర కుటుంబానికి న్యాయం జరిగేవరకు ఉద్యమిస్తామని పేర్కొన్నారు.



'సాయి విష్ణు విల్లాస్'ను సందర్శించిన జోయాలుక్కాస్

ఉత్తమ ప్రమాణాలతో నిర్మిస్తున్నారని కితాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

చదలవాడలోని 'సాయి విష్ణు విల్లాస్ చతుర్వాటిక'ను జోయాలుక్కాస్ ఛైర్మన్ జోయాలుక్కాస్ సందర్శించారు. హెలీకాప్టర్‌లో సాయివిష్ణు విల్లాస్‌కు చేరుకున్న జోయాలుక్కాస్‌ను రవిశంకర్ గ్రూపు ఛైర్మన్ కంది రవిశంకర్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కంది సాయినాథ్ స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అనంతరం బ్యాటరీ వాహనంలో విల్లాస్‌లోని బోట్ క్లబ్స్, పార్కు, మోడల్ హౌసెస్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జోయాలుక్కాస్ మాట్లాడుతూ దేశంలో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో సాయి విష్ణువిల్లాస్ చతుర్వాటిక నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. సంవత్సరన్నర క్రితం ఇక్కడకు వచ్చినప్పుడు ఏమీ లేదని, నేడు విల్లాస్ నిర్మాణాలు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. బోట్ క్లబ్స్, పార్కులను ఆహ్లాదకర వాతావరణంలో నిర్మించారన్నారు. విల్లాస్‌లో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోందన్నారు. సాయి విష్ణు విల్లాస్ మరింతగా అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. రవి శంకర్ గ్రూపు ఛైర్మన్ కంది రవిశంకర్ మాట్లాడుతూ జోయాలుక్కాస్ అధినేత జోయాలుక్కాస్ సాయి విష్ణు విల్లాస్‌ను సందర్శించటం ఆనందంగా ఉందన్నారు. జోయాలుక్కాస్ ఓ విల్లాను కొనుగోలు చేశారని, ఈ సందర్భంగా ఆయనకు ధన్యవాదాలు తెలియజేశారు. సాయి విష్ణు విల్లాస్‌ను నాణ్యతలో రాజీ లేకుండా వినియోగదారులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కంది సాయి, రవిశంకర్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

స్వర్ణలో ముగిసిన సంక్రాంతి సంబరాలు

ప్రజాశక్తి-కారంచేడు

కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో స్వర్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని ప్రత్యేకంగా విద్యార్థులను, యువతను గ్రామీణ క్రీడలను ప్రోత్సహిస్తూ ఈ నెల 14, 15, 16 తేదీల్లో సీనియర్, జూనియర్, సబ్ జూనియర్, ముగ్గుల పోటీ, సైకిల్ స్లో, బైక్ స్లో, చెస్, స్కిప్పింగ్, బ్యాడ్మింటన్, రన్నింగ్, వాలీబాల్, లాంగ్ జంప్, పబ్లిక్ స్పీకింగ్ అంశాలలో పోటీలు జరిగాయి. పోటీల్లో గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను 16వ తేదీ సాయంత్రం విజేతలకు ప్రదానం చేశారు. గత తొమ్మిది సంవత్సరాలుగా ఈ పోటీలు నిర్వహిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. బహుమతులను ఎన్ సుకన్య స్పాన్సర్ చేశారు.

అలరించిన ఏకపాత్రాభినయాలు

ప్రజాశక్తి-ఇంకొల్లు రూరల్

ఎన్‌టిఆర్ కళాపరిషత్ ఆధ్వర్యంలో ఇంకొల్లులో 9వ రోజు జరిగిన ఏకపాత్రాభినయాలు అందరినీ అలరించాయి. గోరంట్ల శింగర కొండయ్య చౌదరి ప్రదర్శించిన శ్రీకృష్ణావతారం ఏక పాత్ర, వేటపాలెంకు చెందిన శ్రీనివాసరావు ప్రదర్శించిన రావణబ్రహ్మ ఏకపాత్రలు అందరినీ అలరించాయి. ఇంకొల్లు శ్రీ ప్రసన్నాంజనేయ మహిళా కోలాటం వారిచే సింహాద్రి వెంకటరెడ్డి మాస్టారు కోలాట ప్రదర్శన నిర్వహించారు. మార్టూరుకు చెందిన శ్రీ పాండురంగస్వామి కోలాట సమాజం వారిచే కోలాట ప్రదర్శన జరిగింది. కరీంనగర్‌కు చెందిన చీకటి పువ్వు నాటిక ప్రదర్శించారు. ప్రేక్షకుల కోరిక మేరకు 2వ రోజు ప్రదర్శించిన రసఝురి పొన్నూరి వారు ప్రదర్శించిన సంపద నాటికను తిరిగి ప్రదర్శించారు.


కోలాటం నిర్వహించిన మహిళలకు మెమొంటో అందిస్తున్న దృశ్యం

నేటి కార్యక్రమాలు

ఈదుమూడి కోలాట సమాజం వారిచే కోలాట ప్రదర్శన జరుగుతుంది. కొప్పెరపాడు జిల్లా పరిషత్ విద్యార్థులచే కోలాట ప్రదర్శన జరుగుతుంది. ఇంకొల్లు ఆదర్శ హైస్కూలు విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. చిలకలూరిపేటకు చెందిన ది అమెచ్యూర్ డ్రమెటిక్ అసోసియేషన్ వారు సమర్పించిన హర్షరుతువు నాటిక, కొప్పోలు వారి పండు క్రియేషన్స్ పక్కింటి మొగుడు నాటిక జరుగుతుంది. అనంతరం ముగింపు సభ జరుగుతుంది.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

బాపట్ల అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఐసీడీఎస్ పిడి ఆఫీసులో వినతిపత్రం అందజేశారు. పిడీ కార్యాలయంలో సూపరింటెండెంట్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె ఝాన్సీ, పి రేఖ, ఎలిజిబెత్ లు మాట్లాడుతూ జిల్లాలో అంగన్‌వాడీ వర్కర్లపై అదనపు భారం పడుతోందని, పని ఒత్తిడి పెరుగుతోందని అన్నారు. రాష్ట్రంలో ఏ జిల్లాలో లేకపోయినా ఈ జిల్లాలో ప్రతి శుక్రవారం సమావేశాలు నిర్వహించటం వల్ల నెలలో 4 రోజులు సెంటర్ నుంచి మండలం కేంద్రం పిహెచ్‌సికి వెళ్లటానికి ఒక్కో వర్కర్‌కు రవాణా చార్జీలు రూ.500 భారం పడుతోందన్నారు. పైగా పని ఒత్తిడి పెరుగుతోందని అన్నారు. ఇప్పటికే 5 సంవత్సరాల నుంచి టిఏ ట్రావెలింగ్ అలెవెన్స్ బకాయిలు ఉన్నాయని అన్నారు. కావున పిహెచ్‌సిలో శుక్రవారం అంగన్‌వాడీలకు మీటింగ్స్ రద్దు చేయాలని కోరారు. ఒకవేళ హెల్త్ మీటింగ్స్ అవసరం అనుకుంటే గ్రామ స్థాయిలో నిర్వహించాలని అన్నారు. వినతిపత్రం ఇచ్చినా తర్వాత సీఐటీయూ కార్యాలయంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి పి రేఖ ఎలిజబెత్ మాట్లాడుతూ రాష్ట్రంలో అంగన్‌వాడీ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, గ్రాట్యూటీ సుప్రీంకోర్టు తీర్పు ప్రమాకం అమలు చేయాలని, అంగన్‌వాడీలకు ఫేస్ హాజరు రద్దు చేయాలని, ప్రతి నెలా 5వ తేదీ లోపు జీతాలు ఇవ్వాలని కోరారు. సమస్యలు పరిష్కరించాలని జనవరి 24, 25 ప్రాజెక్ట్ ఆఫీసుల వద్ద ధర్నాలు, ఫిబ్రవరి 6న పీడీ ఆఫీస్ వద్ద జిల్లాలోని అన్ని ప్రాజెక్ట్స్ వర్కర్లు, హెల్పర్స్ కలిసి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ యూనియన్ బాపట్ల జిల్లా కమిటీ సభ్యులు శైల శ్రీ, అనిత, బసవమ్మ, కామేశ్వరి, మమత, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సిహెచ్ మణిలాల్, సీఐటీయూ నాయకులు జె శ్యామేలు తదితరులు పాల్గొన్నారు.



సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



రాతిలో తేమ నాటికలో ఓ సన్నివేశం

నాటికలను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి-యద్దనపూడి

మండలంలోని అనంతవరం గ్రామంలో మంగళవారం కొల్లా నారాయణ స్వామి కళా ప్రాంగణంలో ఎన్‌టిఆర్ కళాపరిషత్ వారి ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల పరిషత్ నాటికల పోటీలు జరిగాయి. నాటికలు ఆహూతులను అలరిస్తున్నాయి. ముఖ్య అతిథి వెంకట రామారావు మాట్లాడుతూ అధిక ఖర్చుతో కూడుకున్న ఈ రోజుల్లో ఇలాంటి పోటీలు నిర్వహించడం గొప్ప విషయమని అన్నారు. కళలను ప్రోత్సహించవలసిన అవసరం అందరిపై ఉందని అన్నారు. పోటీల్లో రాతిలో తేమ, అతీతం, యాది నాటికలు ప్రదర్శించారు. నేటి నాటికల పోటీలకు ముఖ్య అతిథిగా సినీ హీరో నారా రోహిత్ హాజరవుతున్నారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో బుడ్డయ్య చౌదరి, మురళీకృష్ణ, దాశరథి శ్రీనివాస్, ఆకుల సాంబశివరావు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



గడప గడపకూ కార్యక్రమంలో పాల్గొన్న కోన రఘుపతి

గ్రామాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

గ్రామాల అభివృద్ధికి వైసీపీ కట్టుబడి ఉందని బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు. మంగళవారం బాపట్ల మండలం బేతపూడి గ్రామంలో జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత మూడేళ్ల కాలంలో జరిగిన అభివృద్ధి గురించి ప్రతి గడపకూ వెళ్లి వివరించారు. అనంతరం కరపత్రాల పంపిణీ జరిగింది. ఈ కార్యక్రమంలో దేవరకొండ రాము, అధికారులు, నాయకులు, గ్రామస్తులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కళాశాలను పరిశీలిస్తున్న డిఎస్‌పి శ్రీకాంత్, పక్కన రూరల్ సిఐ మల్లిఖార్జునరావు, వేటపాలెం ఎస్ఐ సురేష్

సెయింట్ ఆన్స్ కళాశాలలో పరీక్ష కేంద్రం

పరిశీలించిన చీరాల డిఎస్‌పి శ్రీకాంత్

ప్రజాశక్తి-వేటపాలెం

స్థానిక సెయింట్ ఆన్స్ కళాశాలలో కానిస్టేబుల్ ఎగ్జామినేషన్ సెంటర్‌ను చీరాల డిఎస్‌పి పి శ్రీకాంత్ మంగళవారం పరిశీలించారు. ఈ నెల 22వ తేదీ నిర్వహించనున్న కానిస్టేబుల్స్ పరీక్షల నిర్వహణకుగాను ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావుతో డిఎస్‌పి శ్రీకాంత్ మాట్లాడారు. సెంటర్లను పరిశీలించారు. అభ్యర్థులు సెంటర్‌కు చేరుకోవడానికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా గట్టి బందోబస్తుకు ఏర్పాటు చేయాలని చీరాల రూరల్ సిఐ ఎ మల్లిఖార్జునరావును ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మొయిద వేణుగోపాలరావు, వేటపాలెం ఎస్ఐ జి సురేష్ పాల్గొన్నారు.



ఓ ఇంటిలో నిల్వ ఉన్న పత్తి

ధర లభించదు.. వెత తీరదు

గిట్టుబాటు ధర లేక పేరుకుపోతున్న పత్తి నిల్వలు • ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని గురిజేపల్లి గ్రామంలోని రైతుల ఇండ్లలో బిటి పత్తి రకానికి గిట్టుబాటు ధర లేకపోవడంతో తమ ఇండ్లలోనే పత్తి నిల్వలు రెండు నెలలుగా పేరుకుపోయాయని గ్రామ రైతులు పెరుమాళ్ల వీరయ్య, చిన్న రాణి, రాజు, కాశీ మల్ల పుల్లయ్య, పెరుమాళ్ళ ఎలమంద ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది వర్షాలు అధికంగా ఉండడంతో, పూత, పిందె రాలిపోయి పత్తి పైరుకు అపార నష్టం జరిగిందని అన్నారు. ఒక ఎకరానికి 10 క్వింటాలు దిగుబడి అయ్యే పత్తి, ఎకరానికి 4 క్వింటాలు మాత్రమే దిగుబడి అయిందన్నారు. ఎకరానికి 50వేల రూపాయలు మించి పెట్టుబడి అయిందన్నారు. ప్రస్తుతం వ్యాపారులు క్వింటాలుకు 6 వేల రూపాయలకు కూడా అడిగే పరిస్థితి లేదన్నారు. ప్రస్తుతం దిగుబడి, పెరిగిన ఎరువుల ధరలను పరిశీలిస్తే కూలీల ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న పత్తి రైతుకు ఎలాంటి నష్టపరిహారం నమోదు చేయలేదన్నారు. క్వింటాలుకు పదివేల రూపాయలు మద్దతు ధర అందితే గాని తాము నష్టాల నుంచి తేరుకోలేమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పత్తి సాగు చేసిన రైతులకు గిట్టుబాటు ధర కల్పించి తమను ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



లోకేష్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న అద్దంకి నియోజకవర్గ మైనారిటీ నాయకులు

లోకేష్‌ను కలిసిన మైనారిటీ నాయకులు

ప్రజాశక్తి-అద్దంకి

హైదరాబాద్‌లోని నారా చంద్రబాబు నాయుడు నివాసంలో తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబును అద్దంకి నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షులు షేక్ కరిముల్లా, మరియు బాపట్ల పార్లమెంట్ మైనారిటీ సెల్ కార్యదర్శి బాజీమసూద్, అద్దంకి మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు షేక్ కరిముల్లా, మీరావలి, ఖాదర్ బాషా, ఈసా తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అద్దంకి నియోజకవర్గంలో ఐటీడీపి గ్రామ కమిటీలు, మండల, నియోజకవర్గాల కమిటీల గురించి అడిగి తెలుసుకుని సోషల్ మీడియా వేదికగా వైసిపి ప్రభుత్వ అసమర్థ పనితీరును ఎండగట్టాలని లోకేష్ దిశానిర్దేశం చేశారని అన్నారు. రానున్న ఎన్నికల్లో యువతే ముఖ్యపాత్ర పోషించాలని, వైసిపి ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలను గ్రామస్థాయిలో ప్రతి ఇంటికి తీసుకువెళ్లాలని సూచించారని తెలిపారు. రాష్ట్రంలో అన్ని వర్గాల వారిపై దాడులు నిత్యకృత్యమయ్యాయని ముఖ్యంగా దళిత, మైనారిటీ నేతలపై దమనకాండ కొనసాగుతోందని లోకేష్ అన్నారని తెలిపారు. మైనారిటీల సంక్షేమ పథకాలను నిలిపేయడం, బడ్జెట్లో మైనారిటీ సంక్షేమానికి కేటాయించిన నిధులు దారి మళ్లించడంపై ప్రతి మైనారిటీ సోదరుని ఇళ్లకు వెళ్లి జరిగిన అన్యాయాన్ని వివరించాలని చెప్పారన్నారు. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మైనారిటీలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందని, ఎటువంటి నిబంధనలు లేకుండా పేద, మధ్య తరగతి కుటుంబాలు ఆర్థికంగా బలపడటానికి బాట వేసిందని గుర్తు చేశారన్నారు. రాబోయేది తెలుగుదేశం ప్రభుత్వమేనని, మైనారిటీలకు అండగా వారి ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు మరెన్నో సంక్షేమ పథకాలు తీసుకొస్తామని, రాజకీయంగా మైనారిటీలకు సముచిత స్థానం కల్పిస్తామని లోకేష్ చెప్పారని తెలిపారు.

పంచాయతీ ఆస్తులు అన్యాక్రాంతం

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

భట్టిప్రోలు గ్రామ పంచాయతీకి సంబంధించిన ఆస్తులు ఆక్రమణదారులతో అన్యాక్రాంతం అవుతున్నాయి. పాండ్ రోడ్డులోని కెఎస్‌కె కళాశాల సమీపంలో సుమారు 50 ఏళ్ల క్రితం ప్రజలకు తాగునీటి కొరత తీర్చేందుకు ఆనాటి పంచాయతీ వారు గిలకల బావిని నిర్మించి దానికి చుట్టుపక్కల ప్రహరీగోడ ఏర్పాటు చేశారు. ఈ బావి ఆ ప్రాంత గ్రామస్థులకు కొన్నేళ్ల పాటు నీటి కొరత తీర్చింది. కాల క్రమేణా రక్షిత మంచినీటి పథకం అమలులోకి రావటంతో బావి వాడకం తగ్గింది. దీంతో బావి కూడా వాడకం లేక శిథిలావస్థకు చేరింది. కొన్నేళ్లుగా ఎవరూ పట్టించుకోకపోవడంతో సమీప గ్రామస్థులు వివిధ రకాలుగా వాడుకోవడం ప్రారంభించారు. కాగా ఇటీవల గ్రామంలో ఎక్కడెక్కడ పంచాయతీ ఆస్తులు ఉన్నాయి అని సర్వే చేయటంతో అక్కడున్న బావి స్థలం బయటపడింది.



పంచాయతీకి చెందిన పూర్వపు బావి

ఈ స్థలాన్ని పంచాయతీకి అవసరమైన కార్యక్రమాలకు వినియోగించాలని పాలకవర్గం భావించింది. కానీ గ్రామంలో కొందరు అధికారపార్టీ నాయకుల అండదండలుతో ఆక్రమించుకొనేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది. అధికార పార్టీ నాయకులకు తోడు పంచాయతీ అధికారి కూడా ఆక్రమణదారునికి అండగా ఉన్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇటీవల గ్రామంలో విచ్చలవిడిగా రోడ్లపై సంచరిస్తున్న ఆవులను బంధించి వాటి యజమానులకు జరిమానాతో అప్పగించాలని, అందుకుగాను ఈ బావి ఉన్న ప్రాంగణం వినియోగించుకోవాలని పాలకవర్గం భావించినా అందుకు సంబంధిత పంచాయతీ అధికారి ఆక్రమణదారుని నుంచి విడిపించటానికి నోటీసులు కూడా జారీ చేయటం లేదని కొందరు పాలకవర్గ సభ్యులు వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే రీతిలో చావలి రోడ్‌లో ఉన్న డంపింగ్ యార్డు వద్ద కూడా అధికార పార్టీ నాయకులు అక్రమ బుసక నిల్వలు చేపట్టి సిబ్బంది పనులకు ఆటంకం కలిగిస్తున్నారని పేర్కొంటున్నారు. వీటన్నిటినీ సరిచేయాల్సిన అధికారి పట్టించుకోకుండా ఆక్రమణదారులకే అండగా ఉన్నారని, ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

'రోటరీ' సేవలు అభినందనీయం : శిద్దా



బహుమతులు అందజేస్తున్న మాజీ మంత్రి శిద్దా

ప్రజాశక్తి-చీమకుర్తి

రోటరీక్లబ్ ప్రపంచవ్యాప్తంగా అందిస్తున్న సేవలు అభినందనీ యమని మాజీ మంత్రి శిద్దా రాఘవరావు తెలిపారు. సంక్రాంతి పండుగ సందర్భంగా రోటరీక్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ సహకారంతో నిర్వహించిన జిల్లా స్థాయి ఆహ్వాన కబడ్డీపోటీలలో గెలుపొందిన విజేతలకు మంగళవారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు రోటరీక్లబ్ అధ్యక్షుడు గొల్లపూడి కోటేశ్వరరావు చౌదరి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా శిద్దా రాఘవరావు మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా చీమకుర్తిలో జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు నిర్వహించడం అభినందనీ యమన్నారు. క్రీడాకారులు గెలు పోటములను సమానంగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు. మద్దిపాడు ఎఎంసి మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలన్నారు. రోటరీక్లబ్ గవర్నర్ రాజశేఖరరెడ్డి మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా రోటరీక్లబ్ సేవలు విస్తృతం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రోటరీక్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు చెరుకూరి రఘుకిరణ్, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు కుర్రాభాస్కరరావు, రోటరీక్లబ్ అసిస్టెంట్ గవర్నర్ సాంబ శివరావు, మాజీ అధ్యక్షుడు శిద్దా సురేష్, కార్యదర్శి తిరుపతిరెడ్డి, నాయకులు మన్నం నాగరాజు, పిఎస్.మూర్తి,ఎం. చలమయ్య, నాగిరెడ్డి ,రామకృష్ణారెడ్డి,వీరారెడ్డి, కె.గంగాధరరావు, కందిమళ్ళ గంగాధరరావు, డాక్టర్ హరిణి పాల్గొన్నారు.

గురవారెడ్డి సేవలు మరువలేనివి

మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

ప్రజాశక్తి-దర్శి

మండల పరిధిలోని చలివేంద్రం కొండ గ్రామానికి చెందిన దారం గురవారెడ్డి సేవలు మరువ లేనివని దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి తెలిపారు. గ్రామంలో ఏర్పాటు చేసిన గురవారెడ్డి విగ్రహాన్ని జడ్‌పి చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మంగళవారం ఆవిష్కరిం చారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ చలివేంద్రం కొండ వద్ద శ్రీవేంకటేశ్వర స్వామి గుడి నిర్మాణం, కాశినాయన ఆశ్రమం నిర్వహణలో గురవారెడ్డి సేవలు మరువలేనివని తెలిపారు. శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయాన్ని సుందరంగా తీర్చి దిద్దారన్నారు. కాశినాయన ఆశ్రమంలో ఆనాధులకు, పేదలకు నిత్యం అన్న దానం నిర్వహించినట్లు తెలిపారు. అనంతరం వేంకటేశ్వరస్వామి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు పాణెం కృష్ణారెడ్డి, ఏడుకొండలు, నాయకులు దారం వాసుదేవరెడ్డి, దారం రామిరెడ్డి, దారం వెంకటేశ్వరరెడ్డి, ఆర్. వెంకటరెడ్డి, సోము దుర్గారెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు అందజేస్తున్న నాయకులు

సందడిగా సంక్రాంతి ఆటలపోటీలు

ప్రజాశక్తి-పామూరు

సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఐద్వా, ఆవాజ్, జన విజ్ఞాన వేదిక, సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మండల పరిధిలోని డివిపాలెంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక గౌరవాధ్యక్షుడు డాక్టర్ టి. చెన్న కష్ణయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాలలో హరిదాసులు కీర్తనలు, బసవన్నల విన్యాసాలు, కోలాటం, గాలి పటాలు అంతరిస్తున్నాయన్నారు. యువత చెడుమార్గంలో పయ నించకుండా మంచి అలవాట్లు నేర్చుకోవాలన్నారు. అనంతరం ముగ్గుల పోటీలు, స్లో సైకిల్ , మ్యూజికల్ చైర్స్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో షేక్ ఖాదర్ బాషా, వైసిపి నాయకులు షేక్ చాంద్ బాషా, ప్రజాసంఘాల నాయకులు భానుమతి, షేక్ ఖాదర్‌నిషా, షేక్ మదార్‌బి, రమీజాబి. పరిమళాదేవి, పార్వతి, సిఐటియు నాయకుడు కె.మాల్యాద్రి, వ్యవసాయ కార్మిక సంఘ నాయకుడు సిహెచ్ వెంకటేశ్వర్లు, జన విజ్ఞాన వేదిక నాయకులు కె.శంకర్, జె. వెంకటేష్, వైవి.నారాయణ పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు చించిన వారిపై చర్యలు తీసుకోండి

వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో టిడిపి నేతల ఫిర్యాదు



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న టిడిపి నాయకులు

ఒంగోలు కలెక్టరేట్ :నగరంలోని గద్దల గుంట వద్ద పారువేట సందర్భంగా ప్రజలకు శు భాకాంక్షలు తెలియజేస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించిన వారిపై చర్యలు తీసు కోవాలని కోరుతూ ఒంగోలు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో టిడిపి నేతలు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 29 డివిజన్ టిడిపి అధ్యక్షుడు పెద్దిశెట్టి చంద్ర, వరలక్ష్మి పారువేట సందర్భంగా ఒంగోలు నగర ప్రజలకు శు భాకాంక్షలు తెలియజేస్తూ కొణిజేడు బస్టాండ్ ప్రాంతంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారన్నారు. ఈ ఫ్లెక్సీలను కొందరు వైసిపి నాయకులు, కార్యకర్తలు అర్ధరాత్రి చించి వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసి మాజీ చైర్మన్ కామేపల్లి శ్రీనివాసరావు, టిడిపి నాయకులు బండారు మదన్, పెద్దిశెట్టి వరలక్ష్మి, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



సముద్ర తీరం వద్ద సందడి చేస్తున్న ప్రజలు

పాకల తీరంలో జన సందడి

ప్రజాశక్తి -శింగరాయకొండ

మండల పరిధిలోని పాకల సముద్ర తీరం వద్ద మంగళవారం జనంతో సందడి నెలకొంది. సంక్రాంతి పండుగ సందర్భంగా దూర ప్రాంతాల నుంచి సొంత గ్రామాలకు వచ్చిన వారు సరదగా గడిపేందుకు కుటుంబ సభ్యులతో కలిసి పాకల తీరం వద్దకు వచ్చారు. సముద్రంలో మునుగుతూ సందడి చేశారు. హైదరాబాదు, చెన్నై, బెంగళూరు ప్రాంతాల నుంచి వచ్చిన సముద్ర తీరంలో సందడి చేశారు.



బహుమతులు అందజేస్తున్న పల్లాపల్లి ఆంజనేయులు

బహుమతులు అందజేత

చీమకుర్తి : సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని నిప్పట్లపాడు గ్రామంలో సిఐటియు ఆధ్వర్యంలో ఆటలపోటీలు నిర్వహించారు. విజేతలకు సిఐటియు మండల కార్యదర్శి పల్లాపల్లి ఆంజనేయులు చేతుల మీదుగా మంగళవారం బహుమతులు అందజేశారు.ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఆటలతో యువతలో ఐకమత్యం పెంపొందుతున్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు గ్రామ కమిటీ సభ్యులు నుగ్గు శ్రీను,ఆదినారాయణ, నరేష్, సుందరరామయ్య తదితతరులు పాల్గొన్నారు.

సిపిఎం సానుభూతిపరురాలు

అలివేలమ్మ మృతి

సిపిఎం నేతల సంతాపం



నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - సంతనూతలపాడు రూరల్

సంతనూతలపాడు మండలం మంగమూరు గ్రామానికి చెందిన సిపిఎం సానుభూతి పరురాలు ఎర్రమనేని అలివేలమ్మ (77) వయోభారంతో సోమవారం రాత్రి మృతి చెందారు. అలివేలమ్మ సిపిఎం సీనియర్ సభ్యులు అబ్బూరి ఆదిశేషయ్య సోదరి. అదేవిధంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జివి.కొండారెడ్డి అత్త. అలివేలమ్మకు ఇద్దరు కుమార్తెలు కోటేశ్వరమ్మ (ఆదిశేషయ్య భార్య), సరళ (కొండారెడ్డి భార్య) ఉన్నారు. ఆ కుటుంబాలు సుదీర్ఘకాలం నుంచి సిపిఎంతో ఉన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వై. సిద్ధయ్య, జాలా అంజయ్య, పూనాటి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎస్‌కె. మాబు, కంకణాల ఆంజనేయులు, చీకటి శ్రీనివాసరావు, ఎం.రమేష్ తదితరులు అలివేలమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళు లర్పించారు. ఆమె మతికి సిపిఎం జిల్లా కమిటీ తరుపున సంతాపాన్ని, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు. అనంతరం అలివేలమ్మ అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కాలం సుబ్బారావు, కంకణాల రమాదేవి, పి.కల్పన, బి.రఘురాం, వి. బాలకోటయ్య, జిల్లా ఆఫీస్ సెక్రెటరీ షేక్ అమీర్, సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శి జి. రమేష్, నగర నాయకులు బి.ముసలారెడ్డి, మారెళ్ళ సుబ్బారావు,టి.శ్రీను, శ్రీరామ శ్రీనివాసులు, హుస్సేన్, బివి.రావు, ఎ.శ్రీను, సిపిఎం సంతనూతలపాడు మండల కార్యదర్శి బంకా సుబ్బారావు, మండల నాయకులు అబ్బూరి వెంకటేశ్వర్లు, నెరుసుల వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్, ఎ. శేషయ్య, మహిళా సంఘం నాయకులు జి.ఆదిలక్ష్మి, బి.గోవిందమ్మ, కె. సజన, బి.రాజ్యలక్ష్మి, వై. అంజనీదేవి, బి.రంగమ్మ, మంగమూరు గ్రామ సిపిఎం సభ్యులు, సానుభూతిపరులు, ప్రజాసంఘాల కార్యకర్తలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

పెన్షనుదారులు లైఫ్ సర్టిఫికెట్లు అందజేయాలి

పొదిలి : పొదిలి తాలూకా పరిధిలోని మూడు మండలాల పెన్షనుదారులు ఫిబ్రవరి చివరిలోపు తమకు చెందిన లైఫ్ సర్టిఫికెట్లను అందజేయాలని స్థానిక సబ్ ట్రెజరీ ఆఫీసర్ చంద్రశేఖర రావు తెలిపారు. పెన్షనర్ల డైరీని మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరావు మాట్లాడుతూ పెన్షనుదారుల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్క రిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పొదిలి తాలూకా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు బాదుల్లా, ప్రధాన కార్యదర్శి షేక్ మదార్‌వలి, అసోసియేట్ అధ్యక్షుడు ఎ.వీరారెడ్డి, గౌరవాధ్యక్షుడు నరసింహారావు, ట్రెజరర చిట్టెంశెట్టి వెంకటేశ్వర్లు, కార్య నిర్వాహక కార్యదర్శి మోహన్ రావు, డి.శ్రీహరి, ఎం.గోవిందయ్య, మూసా జానీ, దశరథ పాల్గొన్నారు

బావి ఆక్రమణకు యత్నం

అడ్డుకున్న గ్రామస్తులు



బావి ఆక్రమణను అడ్డుకుంటున్న స్థానికులు

ప్రజాశక్తి -శింగరాయకొండ

శింగరాయకొండ గ్రామ పంచాయతీ పరిధిలోని బాల యోగినగర్‌లో బాలయోగి స్వామి గుడికి సంబంధించి బావిని పూడ్చి స్థలాన్ని ఆక్రమిం చేందుకు ఓ వ్యక్తికి ప్రయత్నిం చాడు. దీంతో స్థానికులు అడ్డుకున్నారు. ఆదామ్ అనే వ్యక్తి గుడికి సంబంధించిన బావిని ఆక్రమించి పూడ్చేందుకు ప్రయత్నిం చగా స్థానికులు అడ్డుకున్నారు. ఈ విషయం గురించి తెలుసుకున్న ఎస్ఐ ఫిరోజా ఫాతిమా ఘటనా స్థలానికి వెళ్లి స్థాని కులతో మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లా డుతూ బావిని పూడ్చే ందుకు గత రెండు నెలలుగా ప్రయత్ని స్తున్నట్లు తెలిపారు. ఈ విషయం గురించి రెవెన్యూ అధికారులకు గ్రామ పంచాయతీ అధికారులకు సమాచారం ఇచ్చినా వారు పట్టించుకోలేదని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శరత్ బాబు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. బావి స్థలాన్ని ఆక్రమిస్తే చర్యలు తీసు కుంటామని హెచ్చరించారు.



బహుమతులు అందజేస్తున్న మారెడ్డి అరుణ

ముగిసిన వాలీబాల్ పోటీలు

ప్రజాశక్తి - కొండపి

ఆటల పోటీలతో పోటీతత్త్వం పెరుగుతుందని స్త్రీశిశు సంక్షేమ శాఖ చైర్మన్, కొండపి జడ్‌పిటిసి మారెడ్డి అరుణ వెంకటాద్రిరెడ్డి తెలిపారు. సంక్రాంతి సందర్భంగా పెరిదేపి గ్రామంలో నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలునిర్వహించారు. విజేతలకు పిడిసిసి బ్యాంకు చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, మారెడ్డి అరుణ వెంకటాద్రిరెడ్డి చేతుల మీదుగా మంగళవారం బహుమతులు అందజేశారు. అదేవిధంగా ముగ్గుల పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటాద్రిరెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మారెడ్డి శేషారెడ్డి, సురేష్, వెంకటరావు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ధ్యేయం : మంత్రి

ప్రజాశక్తి-త్రిపురాంతకం

పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ తెలిపారు. మండల పరిధిలోని మేడపిలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, జడ్‌పిటిసి మాకం జాన్ పాల్, వైసిపి మండల కన్వీనర్ సింగారెడ్డి పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, ఉభయ దేవాలయాల ట్రస్ట్ చైర్మెన్ పబ్బిశెట్టి పద్మజ మల్లికార్జున, సర్పంచి పొన్నా వెంకట లక్ష్మి, తహశీల్దారు కిరణ్, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. **మార్కాపురం :** అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. మున్సిపాలిటీలోని 5వ వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి గడప గడపకూ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అదేవిధంగా ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హత ఉంటే ఇంటి వద్దకే సంక్షేమం వాలంటీర్ల ద్వారా అందిస్తున్నట్లు తెలిపారు. మార్కాపురం మున్సిపాలిటీలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారానికి తాము చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మురుగు కాలువలు, రహదారులు కూడా చాలా వరకు నిర్మించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ, వైస్ చైర్మన్లు ఇస్మాయిల్, సిహెచ్ అంజమ్మ శ్రీనివాస్, ఐదో వార్డు కౌన్సిలర్ మంగమూరి శ్రీనివాసులు, ఎఎంసి చైర్మన్ గొలమారి శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ కమిషనర్ గిరికుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ షేక్ నాయబ్ రసూల్,కౌన్సిలర్లు, పాల్గొన్నారు **కొండపి :** పేదల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు తెలిపారు. కొండపి మండలం చినకండ్లగుంట పంచాయతీ పరిదిలోని తాటాకులపాలెం గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. అనంతరం అశోక్‌బాబు మాట్లాడుతూ అర్హులకు పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు తెలిపారు. తొలుత మండల పరిధిలోని కె.ఉప్పలపాడు గ్రామానికి చెందిన రాష్ట్ర వైసిపి నాయకుడు డాకా పిచ్చిరెడ్డిని పరామర్శించారు. ఈ కార్యక్రమంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ చైర్మన్, కొండపి జడ్‌పిటిసి మారెడ్డి అరుణవెంకటాద్రిరెడ్డి, గ్రామ సర్పంచి కొర్నేలు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


గడప గడపకూలో మంత్రి ఆదిమూలపు సురేష్


గడప గడపకూలో ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి


గడప గడపకూలో వరికూటి అశోక్‌బాబు

నేడు రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-సంతనూతలపాడు రూరల్

టిడిపి వ్యవస్థాపకుడు, దివగంత మాజీ ముఖ్యమంత్రి ఎన్‌టి.రామారావు 27వ వర్థంతి సందర్భంగా బుధవారం స్థానిక టిడిపి కార్యాలయంలో రక్తదాన శిబిరం, అన్నదానం నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా టిడిపి సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే బిఎన్. విజయ్ కుమార్, టిడిపి ఒంగోలు పార్లమెంట్ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, తూర్పు రాయలసీమ టిడిపి ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌టి.రామారావు అభిమానులు, ప్రజలు విరివిగా పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేడు టిడిపి కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి-పిసిపల్లి

మండల కేంద్రమైన పిసిపిల్లిలో బుధవారం టిడిపి కార్యాలయాన్ని ప్రారంభిస్తున్నట్లు టిడిపి మండల అధ్యక్షుడు వేమూరి రామయ్య తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్‌టిఆర్ వర్ధంతి సందర్భంగా అన్నదానం నిర్వహించనున్నట్లు తెలిపారు. మారేళ్ళ వద్ద యువత ఏర్పాటు చేసిన ఆర్‌వి.అకాడమిని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా టిడిపి కనిగిరి నియోజక వర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.


కొండలరావుకు పరామర్శ

ప్రజాశక్తి-పొన్నలూరు

మండల పరిధిలోని మాలపాడు గ్రామానికి చెందిన కుర్రా కొండలరావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈవిషయం గురించి తెలుసుకున్న టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య, టిడిపి మండల నాయకులు మంగళవారం మాలపాడు వెళ్లి కొండలరావును పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

దొనకొండ : ప్లాస్టిక్ కవర్లను వినియోగించరాదని పంచాయతీ కార్యదర్శి పి.కృష్ణమూర్తి తెలిపారు. పాస్లిక్ కవర్లను వినియోగించవద్దని కోరుతూ మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పంచాయతీ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ప్లాస్టిక్ కవర్లను వినియోగించినా, అమ్మకం చేసినా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. జరిమానా కూడా విధించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచి పఠాన్ ఇమ్రాన్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

సుబ్బారెడ్డికి మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నివాళి

హనుమంతునిపాడు : మండల పరిధిలోని కిచ్చంపల్లి గ్రామ టిడిపి నాయకుడు ఏలూరి శ్రీనివాసరెడ్డి సోదరుడు సుబ్బారెడ్డి గుండెపోటుతో మతి చెందాడు. సుబ్బారెడ్డి మృతదేహాన్ని టిడిపి కనిగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి, ఆయన తండ్రి ముక్కు నర్సారెడ్డి, టిడిపి మండల అధ్యక్షులు సాని కొమ్ము తిరుపతిరెడ్డి, గాయం రామిరెడ్డి, చీకటి వెంకటసుబ్బయ్య, కుందూరు బ్రహ్మారెడ్డి తదితరులు సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు.

శరద్‌యాదవ్‌కు నివాళి

ప్రజాశక్తి-మార్కాపురం

జాతీయ స్థాయిలో బిసి రిజర్వేషన్ల అమలు కోసం తీవ్రంగా కృషి చేసిన శరద్‌యాదవ్‌ను బీసీలు ఎప్పటికీ మర్చిపోలేరని భారత యాదవ మహాసభ క్రమ శిక్షణా సంఘం అధ్యక్షుడు పిఎల్‌పి. యాదవ్ తెలిపారు. స్థానిక బిసి భవన్‌లో శరద్‌యాదవ్ సంస్మరణ సభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఎల్‌పి.యాదవ్ మాట్లాడుతూ బిసి మండల్ కమిషన్ సిఫార్సులు అమలు చేసేలా అప్పటి ప్రధాని విపి సింగ్‌ను ఒప్పించిన శరద్‌యాదవ్ చిరస్మరణీయుడన్నారు. తొలుత శరద్ యాదవ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యాదవ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

అంబేద్కర్ విగ్రహం ఆవిష్కరణ

ప్రజాశక్తి-త్రిపురాంతకం

మండల పరిధిలోని మేడపి అంబేద్కర్ కాలనీలో ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని రాష్ట్ర పురపాలక, పట్టణాభివద్ధి శాఖ మంత్రి అదిమూలపు సురేష్ మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ ఏఒక్క కులానికి చెందిన వారు కాదని, భారతీయులందలరికి చెందిన వ్యక్తి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, ఎంపిపి కోట్ల సుబ్బారెడ్డి, జడ్‌పిటిసి మాకం జాన్‌పాల్, మండల కన్వీనర్ సింగారెడ్డి పొలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, ఉభయ దేవాలయాల ట్రస్ట్ ఛైర్మెన్ పబ్బిశెట్టి పద్మజ మల్లికార్జున, సర్పంచి పొన్నా వెంకట లక్ష్మి, తహశీల్దారు కిరణ్, వివిధ గ్రామాల సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి సురేష్


వరికోతను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయం సిబ్బంది

ప్రకృతి వ్యవసాయంతో మేలు

ప్రజాశక్తి-పామూరు

ప్రకృతి వ్యవసాయం రైతులకు ఎంతో లాభదాయకమని ఐసిఆర్‌పి కందుల శ్రీనివాసరెడ్డి తెలిపారు. మండల పరిధిలోని వగ్గంపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా కె. రమణయ్య అనే రైతు సాగు చేసిన వరి పంటను మంగళవారం కోశారు. ఈ సందర్భంగా ఎఒ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకురాలు షేక్ లోబనా మొహనాజ్, అగ్రికల్చర్ ఇన్స్యూరెన్స్ సూపర్‌వైజర్ వంశీకిరణ్, రైతులు వెంకటేశ్వరరావు, నారాయణ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగార్జున రెడ్డి

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు ఎంతో మేలు జరగుతున్నట్లు లని ఎమ్మెల్యే కుందురు నాగార్జునరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గృహ సారథుల ఎంపికపై నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వాలంటీర్ల సేవలు బాగున్నాయన్నారు. సచివాలయ కన్వీనర్లను ఈ పాటికే ఎంపిక చేశామన్నారు. ఇప్పుడు గృహ సారథులను ఎంపిక చేస్తున్నట్లు తెలిపారు. వాలంటీర్లు, కన్వీనర్లు, గృహ సారథులు ప్రజల్లో తిరగాలన్నారు. ఎ ఇంటిలో ఎలాంటి కష్టముందో గుర్తించాలన్నారు. అర్హత ఉండి పథకం రాకపోతే వారికి పథకం అందేలా కృషి చేయాలన్నారు.కార్యక్రమంలో మార్కాపురం మున్సిపాలిటీ, మార్కాపురం, తర్లుపాడు, కొనకనమిట్ల, పొదిలి మండ లాలకు చెందిన వైసిపి ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

మోడీ ప్రభుత్వాన్ని సాగనంపుదాం

కాంగ్రెస్ పార్టీతోనే దేశానికి మంచి రోజులు ● రాహుల్ గాంధీని ప్రధానిని చేసేందుకు కృషి చేద్దాం: జెడి శీలం

ప్రజాశక్తి-చీరాల

మోడీ పాలనలో దేశ సంపద అంతా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ నిత్యావసర ధరలను పెంచి సామాన్యుడి నడ్డి విరగ్గొట్టిన బిజెపి ప్రభుత్వాన్ని సాగనంపుదామని మాజీ కేంద్రమంత్రి జెడి శీలం అన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశం స్థానిక అంబేద్కర్ భవనంలో చీరాల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు దేవరపల్లి రంగారావు సభాధ్యక్షతన విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు, ఏఐసీసీ కార్యదర్శి మేయపన్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ మస్తాన్‌వలి, పలువురు ముఖ్య నేతలు హాజరై మాట్లాడారు. ముందుగా రాష్ట్ర నాయకులకు స్థానిక మసీదు సెంటర్ వద్ద సాదరంగా స్వాగతం పలికారు. అక్కడ నుంచి ర్యాలీగా బయలుదేరి గడియార స్తంభం మీదుగా ముక్కోణం పార్క్ వద్ద గల


సభలో మాట్లాడుతున్న మాజీ కేంద్ర మంత్రి జెడి శీలం

అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు అక్కడ నుంచి బయలుదేరి అంబేద్కర్ భవన్ వద్దకు చేరుకుని సమావేశం నిర్వహించారు. బీజేపీని నిలదీసేందుకు కేంద్రంలో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని, రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలని అన్నారు. ప్రతి మహిళకూ నెలకు రెండువేల చొప్పున సంవత్సరానికి ఇరవై నాలుగు వేలు ఇస్తానని ప్రియాంకా గాంధీ అన్నారని తెలిపారు. రాహుల్ గాంధీ జోడో యాత్రలో భాగంగా జెడి శీలం బాపట్ల పార్లమెంట్ నియోజకవర్గంలో ఎనభై ఎనిమిది కిలోమీటర్లు నడిచామని గుర్తు చేశారు. రాహుల్ గాంధీని ప్రధాన మంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. జెడి శీలం లాంటి వ్యక్తులు ఉంటే పేదలకు మంచి జరుగుతుందని, అందుకే వచ్చే ఎన్నికలలో బాపట్ల పార్లమెంట్ తరపున ఆయనను గెలిపించాలని, చీరాల నియోజకవర్గంలో దేవరపల్లి రంగారావును గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాపట్ల జిల్లా అధ్యక్షుడు గంటా అంజిబాబు, ఆరు నియోజకవర్గాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, సభ్యులు, చీరాల నియోజకవర్గ స్థాయిలో ఉన్న మర్రి శ్రీనివాసరావు, బండ్లమూడి విజయ్ కుమార్, యాని గ్రేస్, తవటికి రమ్య, మాదాల వైష్ణవి, అరవింద్, దొడ్డా బ్రహ్మానందం, జంగా సునీత, ఇశ్రాయేలు, బండ్ల శ్రీనివాసరావు, పీటర్ రమేష్, ఆలీమ్ బాబు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

21న మైనార్టీల సమస్యలపై రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-రేపల్లె

అబ్ కీ బార్ దళిత ముస్లిం సర్కార్ జై భీమ్ జై మీమ్ నినాదంతో ఈ నెల 21న శనివారం ఉదయం 10 గంటలకు విజయవాడ హొటల్ ఐలాపురంలోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో జై భీమ్ భారత్ పార్టీ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీల సంయుక్త ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి విస్తృత సదస్సును ఏర్పాటు చేసినట్లు జై భీమ్ భారత పార్టీ రేపల్లె అసెంబ్లీ అభ్యర్థి దోవా రమేష్ రాంజీ తెలిపారు. ముస్లిం మైనారిటీ వర్గాలకు చెందిన మేధావులు, విద్యావంతులు పాల్గొని సదస్సును జయప్రదం చేయాలని ఆయన కోరారు. మంగళవారం రేపల్లెలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 10 శాతం వరకు ఉన్న ముస్లిం మైనార్టీ వర్గాలకు జనాభా ప్రాతిపదికన సామాజిక ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక ఆధ్యాత్మిక రంగాలలో ప్రభుత్వాలు చేపట్టవలసిన పథకాలు, రాయితీలు, హక్కులు విధి విధానాలపై చర్చించనున్నట్లు తెలిపారు. తీర్మానించిన అంశాలను వివిధ రాజకీయ పార్టీలు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళతామని పేర్కొన్నారు. ముఖ్యంగా


మాట్లాడుతున్న నాయకులు

రాష్ట్ర ప్రభుత్వం ముస్లిం మైనారిటీలకు రద్దు చేసిన పథకాలను పునరుద్ధరించాలని, సచార్ కమిటీ నివేదికను యథాతథంగా అమలు పరచాలని, విదేశీ విద్య పథకం ద్వారా ప్రతి మైనారిటీ విద్యార్థికి రూ.25 లక్షల గ్రాంట్ ఏర్పాటు కోసం చర్చ, ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేయాలని, మైనార్టీ ఆస్తుల పరిరక్షణకు జిల్లా రాష్ట్ర స్థాయి మైనారిటీ రెలీజియస్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాలని, మదరస బోర్డు ఏర్పాటు చేయాలని, ఉలేమ వెల్ఫేర్ కౌన్సిల్ ఏర్పాటు చేయాలని, ముస్లింలకు కూడా 95 శాతం గ్రాంట్‌తో ప్రభుత్వం రుణ సదుపాయం కల్పించాలని కోరుదాం. మేధావులు విద్యార్థులు వివిధ రాజకీయ పార్టీలకు సంబంధించిన మైనార్టీ వర్గాల ప్రతినిధులు పాల్గొన్నారు.

హెక్సావేర్ టెక్నాలజీస్ కంపెనీకి ఐదుగురు ఎంపిక

ప్రజాశక్తి-వేటపాలెం

ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీ హెక్సావేర్ టెక్నాలజీస్ కంపెనీకు 5గురు విద్యార్థులు ఎంపికైనట్లు సెయింట్ ఆన్స్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, (అటానమస్) కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు సంయుక్తంగా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెక్సావేర్ టెక్నాలజీస్ కంపెనీ 1990లో ముంబాయిలో స్థాపించినట్లు తెలిపారు. ఇది సాఫ్ట్‌వేర్ డెవలప్మెంట్‌కు సంబంధించిన అంతర్జాతీయ కంపెనీ అన్నారు. భారత దేశంలో ఈ కంపెనీకి ముంబాయిలో ప్రధాన కార్యాలయం ఉందన్నారు. ఈ కంపెనీకి బెంగుళూరు, చెన్నై, గుర్గావ్, పూనేలలో బ్రాంచీలు ఉన్నాయని తెలిపారు. ఈ కంపెనీ 2023 ఇంజినీరింగ్ పూర్తి కాబోయే విద్యార్థులకు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో భాగంగా మొదటగా ఆన్‌లైన్ టెస్ట్‌లో 309 మంది పాల్గొన్నారని, కమ్యూనికేషన్ టెస్టులో 26మంది అర్హత సాధించారని పేర్కొన్నారు. 8 మంది టెక్నికల్ రౌండ్ ఇంటర్వ్యూకు అర్హత సాధించారు. ఐదుగురు సిఎస్ఇకి, నలుగురు ఇసిఇ-1కు


ఉద్యోగాలకు ఎంపికై విద్యార్థులతో కళాశాల సిబ్బంది

ఎంపికైనట్లు కళాశాల ప్రధాన అధ్యాపకులు మొయిద వేణుగోపాలరావు తెలియజేశారు. ఈ ప్రాంగణ ఎంపికలలో ఎంపికైన విద్యార్థినికి రూ.4 లక్షల వార్షిక వేతనం, ఇతర అలవెన్సులు లభిస్తాయని కళాశాల ప్రాంగణ ఎంపికల అధికారి నూతలపాటి పూర్ణచంద్రరావు తెలిపారు. వీరికి రెండో సంవత్సరం నుంచి పైథాన్, యాప్టిట్యూడ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో శిక్షణ ఇవ్వడం వలన ఈ ఎంపికలను సాధించినట్లు తెలిపారు. హెక్సావేర్ టెక్నాలజీస్ కంపెనీ వారు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో ఎంపికైన విద్యార్థులకు సిఎస్ఇ విభాగాధిపతి పి హరిణి, ఇసిఇ విభాగాధిపతి కె జగదీష్‌బాబు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసేందుకు కృషి

పంచాయతీరాజ్ ఏఈ రాంకుమార్

ప్రజాశక్తి-పంగులూరు



మండలంలో ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణాలు త్వరగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని, పంగులూరు మండలం పంచాయతీ రాజ్ ఏఈ ఎన్‌వీఎస్ రామ్‌కుమార్ అన్నారు. మంగళవారం పంగులూరులోని పంచాయతీరాజ్ కార్యాలయంలో "ప్రజాశక్తి"తో ఆయన మాట్లాడారు. మండలంలో మొత్తం 14 సచివాలయాలు ఉన్నాయని, వాటిలో నాలుగు సచివాలయాల నిర్మాణాలు పూర్తి చేసుకొని, ప్రారంభం కూడా జరుపుకున్నాయని రామ్ కుమార్ తెలిపారు. పంగులూరులో రెండు సచివాలయాలు, తూర్పు కొప్పెరపాడు, కోటపాడు, సచివాలయాలు పూర్తయ్యాయని, మిగతా 10 సచివాలయాలు నిర్మాణ చివరి దశలో ఉన్నాయని తెలిపారు. 14 రైతు భరోసా కేంద్రాలకు గాను, పంగులూరులో రెండు, కొండమూరు, కొండమంజులూరు, కొప్పెరపాడు, కోటపాడు, రైతు భరోసా కేంద్రాలు నిర్మాణాలు పూర్తయి ప్రారంభించామని, మిగతావి నిర్మాణ దశలో ఉన్నాయని చెప్పారు. వెల్నెస్ కేంద్రాలు పంగులూరు, కోటపాడు, కొండమంజులూరు, అలవలపాడు, కొప్పెరపాడు, గ్రామాల్లో పూర్తయ్యాయని రామ్‌కుమార్ తెలిపారు. పంగులూరులో పది లక్షల రూపాయలతో జడ్పీ జనరల్ ఫండ్ నుంచి, ఎస్సీ కాలనీలో సిమెంట్ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వెల్నెస్ కేంద్రాలు, నిర్మాణాలు త్వరలో పూర్తి చేసి ప్రభుత్వానికి అప్పగిస్తామని ఆయన అన్నారు.


క్రీడాకారులకు బహుమతి ప్రదానం చేస్తున్న మోపిదేవి రాజీవ్

సంక్రాంతి పోటీల విజేతలకు బహుమతి ప్రదానం

ప్రజాశక్తి-నగరం: బాపట్ల జిల్లా నగరం మండలం ఈదుపల్లి గ్రామంలో సంక్రాంతి సందర్భంగా ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయి క్రికెట్ పోటీలు ఈ నెల 11 నుంచి 17 వరకు జరిగిన క్రికెట్ పోటీలలో గెలుపొందిన జట్లుకు రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు తనయుడు రేపల్లె నియోజకవర్గ యువ నాయకులు మోపిదేవి రాజీవ్ బహుమతులు అందజేశారు. ఈ పోటీలలో ప్రథమ బహుమతి రూ.20,000/ చింతల పవన్ కుమార్ ఈదుపల్లి సర్పంచ్, ద్వితీయ బహుమతి రూ.15000/ పురం శివ దుర్గా ప్రసాద్, తృతీయ బహుమతి రూ.10,000/ పురం ఠాగూర్ ఇచ్చి క్రీడాకారులను ప్రోత్సాహించారు. ఇందుకు గాను గ్రామ సర్పంచ్ చింతల పవన్ కుమార్‌ను, కమిటీ వారిని అభినందించారు. ఈ క్రికెట్ టోర్నమెంట్లో మొత్తం 43 జట్లు పాల్గొన్నాయి. మొదటి స్థానం డాక్టర్ గణేష్ టీం చెరుకుపల్లి, రెండో స్థానం ఈదుపల్లి టీం, మూడో స్థానం రాయల్ సీసీ టీం ఇంటూరు గెలుచుకున్నాయి. మొదటి బహుమతి రూ.20 వేలు, షీల్డ్, రెండో బహుమతి రూ.15 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నగరం మండల ఎంపిపి చింతల శ్రీకృష్ణయ్య, ఈదుపల్లి సర్పంచ్ చింతల పవన్ కుమార్, పురం శివ దుర్గా ప్రసాద్, పురం ఠాగూర్, చింతల ప్రసాద్ పాల్గొన్నారు.


పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న దాతలు

రాధాకృష్ణమూర్తి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు ప్రాంతంలో విద్యాభివృద్ధికి చిన్మయ మిషన్ శాఖ ద్వారా సేవలందించిన పాబోలు రాధాకృష్ణమూర్తి 84వ జయంతిని స్థానిక కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆవరణలో నిర్వహించారు. రాధాకృష్ణమూర్తి కుటుంబ సభ్యులు ఉదయభాస్కర్, గిరిజాకుమారి దంపతులు రాధాకృష్ణమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 200 మంది నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తాటి లింగేశ్వరరావు, ఆలయ కమిటీ అధ్యక్షులు శ్రీరాం వెంకటసుబ్బారావు, కాసా అజయ్ తదితరులు పాల్గొన్నారు.


పార్కును పరిశీలిస్తున్న డిఎల్‌పిఓ వెంకట్రావు

పార్కు మరమ్మతులు నిర్వహించాలి: డిఎల్‌పిఓ

ప్రజాశక్తి-చీరాల: ఈపురుపాలెంలోని ప్రగడ కోటయ్య చిన్నారుల పార్కును మంగళవారం డిఎల్‌పిఓ వెంకట్రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిథిలావస్థకు చేరిన పార్కును తక్షణమే మరమ్మతులు నిర్వహించి అభివృద్ధి చేయాలని ఆయన కోరారు. వెనుక వైపు కూలిన గోడను మరలా నిర్మించి పార్కు మొత్తం శుభ్రం చేసి మొక్కలు నాటాలని, పార్కులో పాతబడి ప్రమాదకరంగా ఉన్న బావిని తొలగించి ఆ ప్రాంతంలో ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలని ఈపురుపాలెం పంచాయతీ అధికారులను ఆదేశించామన్నారు. తక్షణమే పార్కు అభివృద్ధి పనులు ప్రారంభించాలని ఆయన అన్నారు. అనంతరం పంచాయతీలో జరిగిన రక్షిత నీటి ప్లాంట్‌పై సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొని సిండికేట్ కాలనీ ప్లాంట్ పున్ణప్రారంభించాలని, అదేవిధంగా ఆదినారాయణపురం సీతారామపేటలో ఉన్న ప్లాంట్లు తీరు మెరుగుపరచాలని అధికారులను ఆదేశించామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ గౌస్ బాషా, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్: బాపట్ల మండలం వెదుళ్లపల్లి గ్రామంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సంక్రాంతి వేడుకలు జరిగాయి. సోమవారం రాత్రి మండల పరిధిలోని వెదుళ్లపల్లి మదర్ థెరిసా కాలనీ నిర్వహించిన కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు బి తిరుమలరెడ్డి, వెంకటరెడ్డి, డాక్టర్ ఆంజనేయచారి, మనోజ్ ఎస్ఎఫ్ఐ, శామ్యూల్, శరత్, నాయకులు, కే వెంకటేశ్వర్లు రెడ్డి జన విజ్ఞాన గ్రామపెద్దలు తిరక బండారు. వెంకటేశ్వర్లు బంజరు, రమణయ్య, సీ ఏసుదాసు, జి, రాజా ఎన్ పేతురు ఎం గురవయ్య, మహిళలు, మదర్ థెరిస్సా యువత పెద్దలు పాల్గొన్నారు. ఉదయం ముగ్గుల పోటీలు, నిర్వహణ సాయంకాలం ఆటలు, బహుమతి ప్రదానంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణాలపై

నిరంతరం పర్యవేక్షించండి

అధికారులకు కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశం


కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణాల లక్ష్యం మేరకు వేగంగా జరిగేలా నిరంతరం పర్యవేక్షించాలని కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. మంగళవారం ఆయన గృహ నిర్మాణ శాఖ అధికారులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల వారీగా ఇళ్ల నిర్మాణాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉగాది నాటికి నిర్దేశించిన 9,700 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా అన్ని చర్యలూ తీసుకోవాలని స్పష్టం చేశారు. ఈ నెల 18వ తేదీ నుంచి ముహూర్తాలు బాగుంటాయని ప్రజలు విశ్వసిస్తుండటంతో ఇళ్ల నిర్మాణాలు కూడా వేగంగా చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. తగిన సమయం ఉన్నందున ప్రణాళికా బద్ధంగా పని చేయాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు ప్రతి రోజూ లబ్ధిదారులతో మాట్లాడుతూ వారికి అవసరమైన సహాయం ప్రభుత్వం నుంచి త్వరగా అందేలా ఉన్నతాధికారులకు నివేదించాలన్నారు. ఉన్నతాధికారులు కూడా కమాండ్ కంట్రోలింగ్ సెంటర్ నుంచి క్షేత్రస్థాయి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ ఉండాలని దిశా నిర్దేశం చేశారు. విధుల నిర్వహణలో సిబ్బంది నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పూర్తయిన నిర్మాణ దశలకు సంబంధించిన బిల్లులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ పేరయ్య, ఈఈలు, డిఈఈలు, ఏఈఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.


పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న యువతి

న్యాయం చేయాలని

పోలీస్‌స్టేషన్ ఎదుట యువతి ధర్నా

అండగా నిలిచిన ఐద్వా, ప్రజాసంఘాలు

ప్రజాశక్తి-కనిగిరి

నమ్మించి గర్భవతిని చేసిన వ్యక్తితో తనకు వివాహం జరిపించి, న్యాయం చేయాలని కోరుతూ ఓ యువతి కనిగిరి పోలీస్‌స్టేషన్ ఎదుట బైటాయించి.. నిరసన తెలిపిన ఘటన మంగళవారం సాయంత్రం కనిగిరిలో చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు.. బేస్తవారిపేట మండలం, శింగరపల్లికి చెందిన డి.శిరీషకు గురువాజీపేటకు చెందిన రెక్కల రామిరెడ్డి అనే యువకుడితో ఏడాది క్రితం పరిచయమైంది. రహస్యంగా వివాహం చేసుకొని కాపురం చేసిన రామిరెడ్డి యువతి గర్భవతి అని తెలిసిన తరువాత 'నువ్వు నాకు అవసరం లేదు' అని వదిలించుకొనేందుకు ప్రయత్నం చేస్తున్నాడు. ఈ క్రమంలో బాధితురాలు కనిగిరి సిఐకి, ఎస్‌పికి తనకు జరిగిన అన్యాయంపై వినతిపత్రం అందజేశారు. రామిరెడ్డితో తనకు వివాహం జరిపించి న్యాయం చేయాలని కోరినప్పటికీ ఎటువంటి ఫలితం లేకపోవటంతో పోలీస్‌స్టేషన్ ఎదుట న్యాయం కోసం బైటాయించారు. బాధితురాలికి ఐద్వా, ప్రజాసంఘాల ఐక్యవేదిక అండగా నిలిచాయి. ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పిసి కేశవరావు, ఐద్వా నాయకులు షేక్ బషీరా, ప్రసన్న మాట్లాడుతూ నమ్మించి గర్భవతిని చేసిన రామిరెడ్డితో శిరీషకు వివాహం జరిపించి.. పోలీసులు న్యాయం చేయాలని లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సిఐ పాపారావు మాట్లాడుతూ ఫిర్యాదుచేస్తే నిందితుడిని తీసుకొచ్చి యువతికి న్యాయం చేసేందుకు తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఐద్వా నాయకులు, ప్రజాసంఘాల ఐక్యవేదిక నాయకులు పాల్గొన్నారు.

నేటి నుండి రోడ్డు భద్రతా వారోత్సవాలు

ఉపరవాణా కమిషనర్ శ్రీకృష్ణవేణి

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

బుధవారం నుండి వారం రోజుల పాటు జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉపరవాణా కమిషనర్ బి.శ్రీకృష్ణవేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వారోత్సవాలు ఈ నెల 18 నుండి 24 వరకు జరుగుతాయని తెలిపారు. అందులో భాగంగా 18న జిల్లా కలెక్టర్ వారోత్సవాలను ఏ.ఎస్.దినేష్‌కుమార్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. అందులో భాగంగా కంటి పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. 19న లారీ ఓనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో రోడ్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం, 20న విద్యార్థులకు రోడ్డు భద్రతపై క్విజ్, వ్యాసరచన పోటీలు నిర్వహించడం, క్విజ్ కళాశాలలో వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం, 22న నగరంలోని కూడళ్లలో ప్రజలకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమం, 23న రైజ్ కళాశాలలో రోడ్డు భద్రత..న్యాయపరమైన వివరాలపై అవగాహన కార్యక్రమం, 24వ తేదీ చివరిరోజు డిటిసి కార్యాలయంలో ముగింపు కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.

పొగాకు రైతులను దగా చేస్తున్న కేంద్రం

- బానిసగా రాష్ట్ర ప్రభుత్వం
- 19న కలెక్టరేట్ వద్ద ధర్నా
- రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు


మాట్లాడుతున్న రైతుసంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు

ప్రజాశక్తి-టంగుటూరు

కార్పొరేట్ సంస్థ అయిన ఐటిసికి ఊడిగం చేసేలా కేంద్ర ప్రభుత్వం పొగాకు రైతులను దగా చేస్తూ సాగును ప్రోత్సహిస్తోందని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పమిడి వెంకట్రావు, పొగాకు బోర్డు మాజీ సభ్యులు చుండూరి రంగారావు విమర్శించారు. మంగళవారం టంగుటూరులో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మాండూస్ తుపానుకు పొగాకు రైతులు ఈ ఏడాది తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నల్లరేగడి నేలల్లో 50 రోజులు నిండిన పొగతోటలు కూడా పీకేసి మళ్లీ నాట్లు వేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఈ సందర్భంగా వారు మంగళవారం మండలంలోని పొందూరు, ఎం నిడమలూరు, మల్లవరప్పాడు, తూర్పు నాయుడుపాలెం తదితర గ్రామాలలో దెబ్బతిన్న పొగాకు పంటలను పరిశీలించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రకాశం జిల్లాలోని ఏడు పొగాకు కేంద్రాల పరిధిలో 94,103 ఎకరాలలో పొగాకును రైతులు సాగు చేశారని, దీనిలో 33 శాతం పొగాకు పూర్తిగా దెబ్బతిన్నట్లు బోర్డు అంచనా వేసిందన్నారు. పొగాకు సాగు ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రూ.40 వేల కోట్ల రూపాయల ఎక్సైజ్ డ్యూటీ, విదేశీ మారకద్రవ్యం కింద మరో రూ.6 వేల కోట్లు పొగాకు సాగుపైనే ప్రభుత్వాలకు ఆదాయం వస్తుందన్నారు. దేశంలో పొగాకు రైతులందరికీ వచ్చే ఆదాయం ఒక్క ఐటిసి కంపెనీకే వస్తుందని, ఇంత ఆదాయం చేకూర్చే పొగాకు రైతులు కష్టాల్లో ఉన్నప్పుడు మాత్రం ప్రభుత్వాలు గానీ, ఐటీసీ కంపెనీ గానీ కనీసం రైతులను పరామర్శించే పరిస్థితి కూడా లేదని విమర్శించారు. రైతుల నుండి అపరాధ రుసుం కింద వసూలు చేసిన సొమ్మే రూ.వెయ్యి కోట్లకు పైగా బోర్డులో ఉందన్నారు. ప్రస్తుత తుపానుకు దెబ్బతిన్న రైతులకు ఎకరాకు రూ.25 వేల నష్టపరిహారంతో పాటు రైతుల రుణాలను వడ్డీ లేకుండా రీ షెడ్యూల్ చేసి బ్యారన్‌కు రూ.లక్ష వడ్డీ లేని రుణం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పాక్షికంగా దెబ్బతిన్న పొగాకు రైతులకు రూ.10 వేల నష్టపరిహారం బోర్డు ద్వారా ఇవ్వాలని, ప్రస్తుతం బోర్డు ప్రకటించిన రూ.10 వేల వడ్డీ లేని రుణం పొగాకు పనులకు వచ్చే కూలీలను సరఫరా చేసే ఆటో ఖర్చులకు కూడా రావని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన కేంద్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి బానిసగా వ్యవహరిస్తోందని విమర్శించారు. రైతుల సమస్యల పరిష్కారానికి ఈ నెల 19వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రైతుసంఘం ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నాకు రైతులు భారీగా హాజరై జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు పరిటాల కోటేశ్వరరావు, టంగుటూరి రాము, వేశపోగు మోజెస్, వేజెండ్ల సింగయ్య, పిడికిటి యలమంద, రావూరి బ్రహ్మానందం, నాగరాజు పాల్గొన్నారు.

మార్కెట్ పట్ల చిన్నచూపు

- ఆదాయం రాబట్టుకోవడంలో వైఫల్యం
- వ్యాపారులకు సౌకర్యాలు కల్పించడంలోనూ నిర్లక్ష్యం


కొత్త కూరగాయల మార్కెట్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

నగరంలోని ఊరచెరువులో ఉన్న దామోదరం సంజీవయ్య కూరగాయల మార్కెట్ పట్ల అధికారులు చిన్నచూపు చూస్తున్నారు. కోట్ల రూపాయలు వెచ్చించి నిర్మించిన మార్కెట్‌ను కార్పొరేషన్‌కు ఆదాయ వనరుగా మార్చుకోవడంలో వైఫల్యం చెందారు. పర్యవసానంగా నెలవారీ రావాల్సిన ఆదాయంలో పావువంతు మాత్రమే వస్తున్నా అధికారులు తమకేమీ పట్టదన్నట్లు వ్యవహరిస్తున్నారు. కోట్ల రూపాయలు అద్దె బకాయిలు పేరుకుపోయినా మిన్నకుండి చూస్తున్నారు. అక్కడ వ్యాపారం చేసుకునేవారికి కనీస సౌకర్యాలు కల్పించడంలోనూ కార్పొరేషన్ అధికారులు వైఫల్యం కనిపిస్తోంది.

ఊరచెరువులోని దామోదర సంజీవయ్య కొత్త కూరగాయల మార్కెట్‌ను దాదాపు ఒకటిన్నర దశాబ్దం కిందట సుమారు రూ.10 కోట్లతో నిర్మించారు. అప్పట్లో ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ నిధులతో నిర్మాణం జరిగినప్పటికీ ఆ నిధులను మున్సిపాలిటీ దశలవారీగా చెల్లించి మార్కెట్‌ను సొంతం చేసుకుంది. హోల్‌సేల్, రిటైల్, పూలు, పండ్లు, దుకాణాలు 400 ఉన్నాయి. వీటి ద్వారా నెలకు రూ.20 లక్షలు చొప్పున సంవత్సరానికి రూ.2.40 కోట్లు అద్దెల రూపంలో కార్పొరేషన్‌కు ఆదాయం రావాల్సి ఉంది. ప్రస్తుతం నెలకు రూ.5 లక్షలు అద్దెలు రావడం కూడా గగనంగా మారింది.

మార్కెట్‌లోని షాపులన్నీ వేలం పద్ధతి ద్వారా వ్యాపారులకు కేటాయించారు. వారు వారికి కేటాయించిన షాపులలో కాకుండా మార్కెట్‌లోని ఖాళీస్థలంలో తాత్కాలిక షెడ్లు వేసుకొని వ్యాపారం చేస్తున్నారు. కొంతమంది నిబంధనలకు విరుద్ధంగా మార్కెట్‌లో వారి ఇష్టానికి షాపులు కూడా కట్టుకున్నారు. ఇదేమని అంటే తమకు కేటాయించిన షాపుల వద్దకు జనాలు రావడం లేదని, వ్యాపారాలు జరగడం లేదని చెబుతు న్నారు. దీంతో మార్కెట్ బహిరంగ ప్రదేశం అస్తవ్యస్తంగా తయారైంది. ఇరుకు షెడ్లతో కూరగాయలు కొనుగోలు చేసేవారికి ఇబ్బందిగా మారింది. వ్యాపారులతో మాట్లాడి ఎవరికి కేటాయించిన షాపులలో వారు వ్యాపారం చేసుకునే విధంగా చూడాల్సిన అధికారులు ఆ పని చేయడం లేదు. మార్కెట్‌లో తాగునీరు వసతి కల్పించడం, మెరుగైన పారిశుధ్యం నిర్వహించడంలోనూ వైఫల్యం కన్పిస్తోంది. మార్కెట్‌లో చాలా వరకు దుకాణాలు ఖాళీగా ఉన్నాయి. వాటిని వేలం పాడుకునేందుకు ఎవరూ పెద్దగా ఆసక్తి చూపడం లేదు. ఈ పాటికే ఉన్న వ్యాపారులు వారి షాపులను వదిలి బహిరంగ ప్రదేశాలలో తాత్కాలిక షెడ్లు ఏర్పాటు చేసుకొని వ్యాపారాలు చేసుకుంటుండంతో ఖాళీగా ఉన్న దుకాణాలను వేలం ద్వారా దక్కించుకునేందుకు ఎవరూ ఆసక్తి చూపడం లేదు. ఇప్పటికైనా అధికారులు మార్కెట్‌లోని షాపుల విషయంలో ఒక నిర్దిష్ట విధానం అమలు చేస్తే కార్పొరేషన్‌కు ఏడాదికి ఒక్క కూరగాయల మార్కెట్ నుంచే సుమారు రూ.2 కోట్లకు పైగా ఆదాయం చేకూరే అవకాశం ఉంది. కొంతమంది రెవెన్యూ సిబ్బంది అక్కడ కొంతమంది వ్యాపారులతో కుమ్మక్కై మార్కెట్‌లో తాత్కాలిక షెడ్ల నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అందుకే మార్కెట్‌లోని బహిరంగ ప్రదేశాలలో అక్రమంగా ఎన్ని తాత్కాలిక షెడ్లు, కట్టడాలు వచ్చినా వారు పట్టించుకోవడం లేదనే ప్రచారం జరుగుతోంది. కార్పొరేషన్ అధికారులు వారి స్వప్రయోజనాలను పక్కన పెట్టి కార్పొరేషన్‌కు ఆదాయం వచ్చే మార్కెట్‌లాంటి వాటి మీద దృష్టి పెట్టి కార్పొరేషన్ ఖజానాను పెంచేందుకు చర్యలు చేపట్టాలని పలువురు కార్పొరేటర్లు కోరుతున్నారు.